నేటి కందం- నేటికి అందం



నయవిదుని,తెలంగాణను
రయమున తేగోరినట్టి రణజన్ముండౌ
జయశంకరు నాశయముల
ప్రియముగ చదివించవలయు విద్యార్థులచేన్ !!

తెలంగాణా రూపకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సభలో వక్తలు

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

శారీరక మానసిక
సమన్వయ శక్తి యోగ
అల్లుటేల దాని చుట్టు
ఆధ్యాత్మిక భక్తి తీగ
ప్రతిరోజు శ్రద్ధతోని
పాటిస్తెనే దాని ఫలం
వేదుకలా చేసి దాన్ని
వదిలివేస్తే నిష్ఫలం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 22-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:242 పేజీలు:6 వెల: రూ.1/-


# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం.. మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, జూన్ 21:ప్రతి రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే వేడుకలను ఆయుష్, ఆరోగ్యశాఖ సంయుక్తంగా శనివారం ఘనంగా నిర్వహించాయి. ఈ అధికారిక కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్పోర్ట్స్ మినిస్టర్ వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు ఇతర ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఐదు వేల మంది విద్యార్థులు, యువకులు, యోగా సాధకులు పాల్గొని యోగాసనాలు వేశారు.

## ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్ప వరం ..

ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని మంత్రి రాజనర్సింహ అన్నారు. ప్రపంచానికి ఈ వరాన్ని అందించిన గురువు, మహర్షి పతంజలి ని ఈ సందర్భంగా మనందరం స్మరించుకోవాలని అన్నారు. పతంజలి అందించిన అష్టాంగ యోగ విద్యలే, ప్రస్తుత యోగాకు ప్రాణాధారమని, యోగా అనేది కేవలం వ్యాయామానికి సంబంధించినది కాదని శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే అద్భుతమైన సాధనమని వివరించారు. ప్రస్తుతమున్న ఉరుకుల పరుగుల జీవన శైలితో బీపీ, షుగర్, కేన్సర్లు, కిడ్నీ సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, కోట్లు సంపాదించే వారికి కూడా ప్రశాంతత ఉండడం లేదని, ఇటువంటి సమస్యలన్నింటికీ యోగా చక్కని పరిష్కార మార్గం చూపుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## 630 యోగా గురువుల నియమించిన ప్రభుత్వం..

యోగాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 630 మంది యోగా గురువుల (జనీణజీ బివజీఇష్ట్రవతీబ) ను నియమించినట్లు, మరో 264 మంది యోగా గురువుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. హెల్త్ సబ్‌సెంటర్లలో రోజూ ఉదయం యోగా క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది కాలంలో కొత్తగా ఐదు లక్షల మందికి యోగా నేర్పించామన్నారు. అన్ని విద్యా సంస్థల్లో యోగా నేర్పించేలా ప్రోత్సహిస్తున్నామని, నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో పీజీ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగాను చేరువ చేస్తామని హామీ ఇచ్చారు.

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్ ..



హైదరాబాద్, జూన్ 21: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు.

ఇవాళ ఉదయం సచివాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడ్లూరికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు శ్రీధర్ బాబు , తుమ్మల నాగేశ్వర్‌రావు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ వివ్ ఆది శ్రీనివాన్ తోపాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# తెలంగాణలో బలమైన ఈదురుగాలులతో వానలు..! హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, జూన్ 21:తెలంగాణలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ వర్షాలు పడే సూచనలున్నాయని ప్రకటించింది.

శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడుతాయని చెప్పింది.

ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశం ఉందని వివరించింది.






# ఈ యోగా దినోత్సవం- అంతఃశాంతిని ప్రపంచ విధానంగా మార్చే మానవత 2.0గా మారాలని ఆశిస్తున్నా: ప్రధానమంత్రి



అమరావతి, జూన్ 21:ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఈరోజు జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ (ఐవైడీ) కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధానమంత్రి సామూహిక యోగా సాధనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధానమంత్రి.. భారత్‌తో పాటు, యావత్ ప్రపంచ ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం యావత్ ప్రపంచం ఐక్యంగా యోగా సాధన చేయడం ఈనాటితో 11వ కార్యక్రమమని ఆయన తెలిపారు. "ఐక్యత" యోగా సారమనీ, యావత్ ప్రపంచాన్ని యోగా ఇలా ఏకం చేయడం చూస్తుంటే సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. గత దశాబ్ద కాలంగా యోగా ప్రయాణం గురించి ప్రస్తావిస్తూ, ఐక్యరాజ్య సమితిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఆలోచనను భారత్ ప్రతిపాదించిన క్షణాన్ని శ్రీ నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. 175 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చాయని, ఇది యావత్ ప్రపంచ ఐక్యతకు అరుదైన ఉదాహరణగా అభివర్ణించారు. ఈ మద్దతు కేవలం ఒక ప్రతిపాదన మాత్రమే కాదని, మానవాళికి మేలు చేసేందుకు ప్రపంచం చేసిన సమష్టి ప్రయత్నాన్ని ఇది సూచిస్తుందన్నారు. "పదకొండు సంవత్సరాల తరువాత, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవనశైలిలో యోగా అంతర్భాగంగా మారింది" అని ఆయన చెప్పారు. దివ్యాంగులు బ్రెయిలీలో యోగా గ్రంథాలను చదవడం, శాస్త్రవేత్తలు అంతరిక్షంలో యోగా సాధన చేయడం గర్వంగా ఉందన్నారు. యోగా ఒలింపియాడ్స్‌లో గ్రామీణ ప్రాంతాల యువత ఉత్సాహంగా పాల్గొనడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. సిడ్నీ ఒపెరా హౌస్ మెట్ల మీదైనా, ఎవరెస్ట్ శిఖరం దగ్గరైనా, విశాలమైన సముద్రపు తీరంలోనైనా, "హద్దులు.. నేపథ్యాలు.. వయస్సు.. సామర్థ్యాలకు అతీతంగా యోగా అందరిదీ" అనే సందేశంలో మార్పు ఉండదని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

ప్రకృతి, అభివృద్ధి సంగమం అయిన విశాఖపట్నంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలను ప్రశంసించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర అభియాన్ పేరుతో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమ విజయం కోసం నారా లోకేశ్ చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. యోగాను నిజమైన సామాజిక వేడుకగా.. సమాజంలోని అన్ని వర్గాలను కలిపే వేదికగా చూపడంలో లోకేశ్ విజయవంతం అయ్యారని పేర్కొన్నారు. గత ఒకటిన్నర నెలలుగా యోగాంధ్ర అభియాన్ విజయం కోసం కృషి చేసిన లోకేశ్ ఆదర్శప్రాయమైన నిబద్ధతను ప్రదర్శించారని శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు.

యోగాంధ్ర అభియాన్‌లో రెండు కోట్లకు పైగా ప్రజలు భాగస్వాములయ్యారనీ, ఇది ప్రజల భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందనీ ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ స్ఫూర్తి వికసిత్ భారత్ సాధనకు పునాదిగా నిలుస్తుందన్నారు. పౌరులు స్వయంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధన కోసం చురుగ్గా కృషి చేసినప్పుడు.. చేరుకోలేని లక్ష్యం ఏదీ ఉండదని వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ప్రజల సద్భావన, వారి ఉత్సాహభరితమైన ప్రయత్నాలే కనిపించాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవ ఇతివృత్తమైన "యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్" గురించి ప్రస్తావిస్తూ... ఈ ఇతివృత్తం.. భూమిపై ఉన్న ప్రతి జీవి ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉందనే లోతైన సత్యాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. మానవ శ్రేయస్సు.. మనకు అన్నం పెట్టే నేల ఆరోగ్యం, మనకు నీటిని అందించే నదులు, మన పర్యావరణ వ్యవస్థను పంచుకునే జంతువులు, మనల్ని పోషించే మొక్కల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. యోగా మనకు ఈ పరస్పర అనుసంధానాన్ని తెలియజెప్పి, ప్రపంచంతో ఏకమయ్యే దిశగా మార్గనిర్దేశం చేస్తుందని శ్రీ నరేంద్ర మోదీ వివరించారు. "మనం ఒంటరి కాదని, ప్రకృతిలో భాగస్వాములమని యోగా గుర్తుచేస్తుంది. మొదట్లో మన సొంత ఆరోగ్యం, శ్రేయస్సు పట్ల మాత్రమే శ్రద్ధ వహించడం నేర్చుకుంటాం. కానీ క్రమంగా ఈ సంరక్షణ మన పర్యావరణం, సమాజం, యావత్ భూమండల ఆరోగ్యం గురించి ఆలోచించే వరకూ విస్తరిస్తుంది. యోగా ఒక లోతైన వ్యక్తిగత క్రమశిక్షణ. ఇది వ్యక్తులను 'నేను' నుంచి 'మనం' అనే భావన దిశగా నడిపించి మనలో మానవత్వాన్ని పెంపొందిస్తుంది" అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

"నేను నుంచి మనం అనే భావన భారత స్ఫూర్తిని సూచిస్తుంది" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఒక వ్యక్తి స్వార్థానికి అతీతంగా ఉండి సమాజం గురించి ఆలోచించడం ప్రారంభించినప్పుడే మొత్తం మానవాళి సంక్షేమం సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. భారతీయ సంస్కృతిని ప్రస్తావిస్తూ, అది "సర్వే భవంతు సుఖినః" అంటే సర్వజనుల సంక్షేమమే మన పవిత్ర కర్తవ్యం అనే విలువను మనకు బోధిస్తుందన్నారు. 'నేను' నుంచి 'మనం' వైపు ఈ ప్రయాణం సేవ, అంకితభావం, సహజీవనానికి పునాదిని ఏర్పరుస్తుందని పేర్కొన్నారు. ఈ ఆలోచనే సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తుందని ప్రధాన మంత్రి తెలిపారు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న ఒత్తిడి, అశాంతి, అస్థిరతపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రధానమంత్రి.. ఇటువంటి సమయాల్లో యోగా శాంతికి మార్గాన్ని అందిస్తుందని వ్యాఖ్యానించారు. "మానవాళి గాలి పీల్చుకోవడానికీ, జీవితాన్ని సమతుల్యం చేసుకోవడం ద్వారా తిరిగి పరిపూర్ణులుగా మారేందుకు అవసరమైన పాజ్ బటన్ వంటిదే యోగా" అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ప్రపంచ సమాజానికి ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ, "ఈ యోగా దినోత్సవం ప్రపంచానికి అంతఃశాంతిని ప్రసాదించే మానవత 2.0 ప్రారంభాన్ని సూచించేలా" మనమంతా కృషి చేయాలని కోరారు. యోగా కేవలం వ్యక్తిగత అభ్యాసంగా ఉండకుండా, ప్రపంచంతో భాగస్వామ్యాలకు ఒక మాధ్యమంగా పరిణావంం చెందాలన్నారు. ప్రతి దేశం, ప్రతి సమాజం యోగాను వారి జీవనశైలి, ప్రజా విధానాలతో అనుసంధానించాలని ఆయన పిలుపునిచ్చారు. శాంతి, సమతుల్యత, సుస్థిరత దిశగా ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సమష్టి కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. "యోగా ప్రపంచాన్ని సంఘర్షణ నుంచి సహకారానికి, ఒత్తిడి నుంచి పరిష్కారాలకు మార్గనిర్దేశం చేయాలి" అని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

ఆధునిక పరిశోధనల ద్వారా యోగ శాస్త్రాన్ని బలోపేతం చేయడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను ప్రధానమంత్రి వివరించారు. దేశంలోని ప్రముఖ వైద్య సంస్థలు యోగా పరిశోధనలో చురుగ్గా నిమగ్నమై ఉన్నాయన్నారు. సమకాలీన వైద్య పద్ధతులతో యోగ శాస్త్రీయ ఔచిత్యాన్ని అనుసంధానించే లక్ష్యంగా వారు కృషి చేస్తున్నారని తెలిపారు. భారత్ తన వైద్య, పరిశోధనా సంస్థల ద్వారా యోగా రంగంలో ఆధారాల ఆధారిత చికిత్సను ప్రోత్సహిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశలో ఆదర్శప్రాయమైన కృషి చేసిన న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఎయిమ్స్ పరిశోధన ఫలితాలను ఉటంకిస్తూ.. గుండె, నాడీ సంబంధిత రుగ్మతల చికిత్సలో, అలాగే మహిళల ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును మెరుగుపరచడంలో యోగా గణనీయమైన ప్రభావాన్ని చూపిందని పేర్కొన్నారు.

జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా యోగా, ఆరోగ్య సందేశం చురుగ్గా ముందుకు వెళుతున్నదని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ ప్రయత్నంలో డిజిటల్ టెక్నాలజీ గణనీయమైన పాత్ర పోషించిందని ఆయన వ్యాఖ్యానించారు. యోగా పోర్టల్, యోగాంధ్ర పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా పది లక్షలకు పైగా కార్యక్రమాలు నమోదయ్యాయని, ఇది దేశవ్యాప్తంగా యోగా పరిధి గణనీయంగా విస్తరించడాన్ని సూచిస్తుందన్నారు. దేశంలోని ప్రతి మూలలో జరుగుతున్న కార్యక్రమాల స్థాయి.. పెరుగుతున్న యోగా ప్రభావాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

"హీల్ ఇన్ ఇండియా" మంత్రానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను ప్రస్తావిస్తూ, వైద్యం కోసం ప్రముఖ గమ్యస్థానంగా భారత్ ఆవిర్భవించిందన్నారు. ఈ అభివృద్ధిలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. యోగా సాధనను ప్రామాణీకరించే ఒక సాధారణ యోగా ప్రోటోకాల్ అభివృద్ధి చేయడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. 6.5 లక్షలకు పైగా వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి, సుమారు 130 సంస్థలకు గుర్తింపును అందించిన యోగా సర్టిఫికేషన్ బోర్డు ప్రయత్నాలను ప్రస్తావించిన ప్రధానమంత్రి, సమగ్ర ఆరోగ్య వ్యవస్థ నిర్మాణంలో భాగంగా వైద్య కళాశాలల్లో 10 రోజుల యోగా మాడ్యూల్‌ను చేర్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లోనూ శిక్షణ పొందిన యోగా ఉపాధ్యాయులను నియమించినట్లు ఆయన తెలిపారు. భారత ఆరోగ్య వ్యవస్థ నుంచి ప్రపంచ సమాజం ప్రయోజనం పొందేలా చూసేందుకు, ప్రత్యేక ఇ-ఆయుష్ వీసాలను అందించనున్నట్లు ప్రధానమ ంత్రి ప్రకటించారు.

స్థూలకాయం సమస్య పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, దీనిని ప్రపంచవ్యాప్త సవాలుగా అభివర్ణించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈ అంశంపై తాను చేసిన చర్చను శ్రీ నరేంద్ర మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రోజువారీ ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించే సవాలును స్వీకరించాలన్నారు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. వ్యక్తులు తమ భోజనంలో కనీసం 10 శాతం నూనె వినియోగాన్ని ఎలా తగ్గించుకోవచ్చనే విషయంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నూనె వినియోగాన్ని తగ్గించడం, అనారోగ్యకరమైన ఆహారాన్ని నివారించడం, యోగా సాధన చేయడం ఆరోగ్యకరమైన జీవనశైలిలో ముఖ్యమైన భాగాలని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

యోగాను ఒక జన ఆందోళన్ అంటే ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం వైపు నడిపించే ఉద్యమం అవసరమన్నారు. జీవితంలో సమతుల్యతను తీసుకురావడానికి ప్రతి వ్యక్తి యోగాతో తమ రోజును ప్రారంభించాలనీ, ఒత్తిడి లేని జీవితం కోసం ప్రతి సమాజం యోగాను స్వీకరించాలని ఆయన కోరారు. "యోగా మానవాళిని ఏకం చేసే మాధ్యమంగా పనిచేయాలి.. యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ నినాదం ప్రపంచ సంకల్పంగా మారాలి" అని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ సయ్యద్ అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్ చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు, శ్రీ జాదవ్ ప్రతాపరావు గణపత్‌రావు, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ తదితరులు పాల్గొన్నారు.

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై) సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన ప్రధాన వేడుకలకు ప్రధానమంత్రి నాయకత్వం వహించారు. విశాఖపట్నం బీచ్‌ఫ్రంట్‌లో జరిగిన కామన్ యోగా ప్రోటోకాల్ (సీవైపీ) కార్యక్రమంలో దాదాపు 5 లక్షల మందితో కలిసి ఆయన యోగా సాధన చేశారు. అదే సమయంలో దేశానికి సామరస్యపూర్వక యోగా ఆవశ్యకతను వివరించారు. దేశవ్యాప్తంగా 3.5 లక్షలకు పైగా ప్రదేశాల్లో యోగా సంగమ్ కార్యక్రమాలు ఏకకాలంలో జరిగాయి. ఈ సంవత్సరం, సామూహిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో యోగా అన్‌ప్లగ్డ్ కార్యక్రమం కింద మైగవ్, మైభారత్ వంటి వేదికలపై యోగా విత్ ఫ్యామిలీ, యువత భాగస్వామ్యం గల కార్యక్రమాలతో ప్రత్యేక పోటీలను ప్రారంభించారు.

"యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్" అనే ఈ సంవత్సర ఇతివృత్తం.. మానవులు, సమస్త భూమండల ఆరోగ్యం పరస్పర అనుసంధానితమనే సందేశాన్నిస్తుంది. "సర్వే సంతు నిరామయ" (అందరూ వ్యాధి నుంచి విముక్తి పొందాలి) అనే భారత తత్వంలోని ప్రపంచ సామూహిక శ్రేయస్సు దృక్పథాన్ని ఇది ప్రతిధ్వనిస్తుంది. 2015లో జూన్ 21ని ఐడీవైగా పాటించాలనే భారత్ ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యూఎన్‌జీఏ) ఆమోదించినప్పటి నుంచి.. ప్రధానమంత్రి న్యూఢిల్లీ, చండీగఢ్, లక్నో, మైసూరు, న్యూయార్క్ (యూఎన్ ప్రధాన కార్యాలయం), శ్రీనగర్ సహా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన యోగా దినోత్సవ ప్రధాన వేడుకలకు నాయకత్వం వహించారు. అప్పటి నుంచి ఐడీవై ఒక శక్తిమంతమైన ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా అభివృద్ధి చెందింది.

# విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణ దిక్సూచి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**-అందుకు సిద్ధమవుతున్న ప్రణాళికలు**
**-విద్యుత్ ఉద్యోగులకు రెండు శాతం డీఏ పెంపు**
**-71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం**
**-ప్రతి నెలా రూ. 11.193 కోట్లు ప్రభుత్వంపై భారం**
**-భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం కావాలి**
**-డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్, జూన్ 21:తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో దేశానికి దిక్సూచి కావాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళుతోందని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజాభవన్‌లో శనివారం విద్యుత్ ఉద్యోగులకు డీఏ ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందులో భాగంగా విద్యుత్ ఉద్యోగులు , పెన్షనర్లకు 1.944 శాతానికి డీఏని పెంచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్ప మనసుతో తీసుకున్న నిర్ణయం ఫలితంగా రాష్ట్రంలోని 71,417 ఇది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

## 16.018% శాతానికి చేరిన డీఏ

భట్టి విక్రమార్క మాట్లాడుతూ. ఈ పెంచిన డిఎ విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్ల తో పాటు ఆర్టిజన్స్ కు వర్తిస్తుందని అన్నారు. గతంలో 14.074% గా ఉన్న డీఏ ను 16.018% శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పెంచిన డిఎ ఈ సంవత్సరం జనవరి నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. పెంచిన డీఏతో విద్యుత్ సంస్థపై ప్రతి నెల 11.193 కోట్ల రూపాయల భారం పడుతుందని చెప్పారు. అయినా ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

## రెండు వేల మెగావాట్ల డిమాండ్ అదనంగా పెరిగింది

భట్టి విక్రమార్క మాట్లాడుతూ మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో పోటీ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అనివార్యమైందన్నారు. 2023 మార్చిలో 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ రాగా, 2025 మార్చిలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే అదనంగా 2000 మెగావాట్ల విద్యుత్ ( డిమాండ్ వచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగులు ఓ కుటుంబం మాదిరిగా శ్రమించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరాను చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరగనుందని అన్నారు.



## మరో ఐదేళ్లలో 26,299 మెగావాట్ల విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో 2029-30 నాటికి 26,299 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడ నుందని భట్టి అంచనా వేశారు. 2034-35 నాటికి 33, 773 మెగావాట్ల డిమాండ్ ఏర్పడుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ (ఇవనిబితీజీశ్రీ ణనీలవతీనివవనిబి జీణవనిఇఎ) నివేదిక ఇచ్చిందని వివరించారు. భవిష్యత్తు డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 తీసుకువచ్చి 2029-30 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు.

భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగులు ఒక ఆదర్శ కుటుంబం అని డిప్యూటీ సీఎం (ఆవజుబీబిఏ అఓ) అభివర్ణించారు. కార్యక్రమంలో జెన్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు రత్నాకర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు శివాజీ, 1104 యూనియన్ నేత సాయిబాబా, 327 యూనియన్ నాయకులు శ్రీధర్ , పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకుడు బేసిరెడ్డి, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకుడు శ్యామ్ మనోహర్, 1535 యూనియన్ నాయకులు వజీర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు సత్యనారాయణ, టీఆర్‌వీకేఎస్ యూనియన్ నాయకులు కరెంటు రావు తదితరులు పాల్గొన్నారు.

# బహుళ ప్రయోజనాలు కలిగిన వర్షారణ్యాలు

## (22 జూన్ "ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం" సందర్భంగా)

హరిత వృక్షాలకు నెలవులు, జీవకోటి తావులు, పర్యావరణహిత సేవలు చేస్తున్న వర్షారణ్యాలు లేదా రెయిన్ ఫారెస్టులు ప్రపంచ మానవాళి మనుగడకు అమూల్య సేవలు అందిస్తున్నాయి. నేలలో తేమ పునాదులుగా నిత్యం పచ్చని పందిరిలను పరుస్తున్న వర్షారణ్యాలు వివిధ వృక్ష జంతు చిరునామాలుగా నిలుస్తున్నాయి. కార్చిచ్చులకు తావులేని వర్షారణ్యాలు తరతరాలుగా మానవ జీవితాలకు నీడగా నిలుస్తూ, భూమాతను కాలుష్యం నుంచి కాపాడుతూ ఎనలేని సేవలను చేస్తున్నాయి. వర్షారణ్యాల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంచర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 22 జూన్ రోజున "ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం (వరల్డ్ రెయిన్‌ఫారెస్ట్ డే)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. వర్షారణ్యాలను కాపాడుకోవడం, రక్షణ గొడుగులు పట్టడం మన కనీస కర్తవ్యం కావాలి.

వర్షారణ్యాల బహుళ ప్రయోజనాలు:

భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకర వాతావరణం, జీవ వైవిధ్యం అందించడానికి నేడే కార్యాచరణకు పూనుకోవాలి. అడవుల నరికివేతను నిషేధించడం, అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడం, సుస్థిర ప్రణాళికలు అమలు చేయడం విధిగా జరగాలి. వర్షారణ్యాల్లో అపార పక్షులజాతులు, వైవిధ్య జంతు జాతులు, విలువైన వృక్ష సంపద దాగి ఉంటాయి. మానవాళికి సురక్షిత తాగునీరు అందించే నెలవులుగా వర్షారణ్యాలు పని చేస్తున్నాయి. గాలిలో కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించడం, భూమాత రక్షణకు చేయూతనివ్వడం, ప్రతికూల వాతావరణ మార్పులను కట్టడి చేయడం, విలువైన ఔషధాలను అందించడం, కలపను అందించడం, మాంసానికి తావులు, పర్యాటకానికి ఊతమివ్వడం, పోషకాహారాన్ని అందించడం, నేల సారాన్ని పెంచడం, సాంస్కృతిక ప్రదేశాలుగా నిలవడం, ఆహార భద్రతకు చేయూతనివ్వడం, జీవ వైవిధ్య పరిరక్షణ, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, మిలియన్ల కుటుంబాలకు జీవనోపాధులను కల్పించడం లాంటి పలు ప్రయోజనాలను వర్షారణ్యాలు కల్పిస్తున్నాయి.

2017లో ప్రారంభమైన ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం వేదికగా మానవాళి ఆరోగ్యానికి ఉపకరిస్తున్న వర్షారణ్యాలను కాపాడుకుంటూనే, జీవకోటి మనుగడకు ఊపిరులూదుతూ పటిష్ట అడుగులు పడాలి. 2025 ప్రపంచ వర్షారణ్యాల దినం ఇతివృత్తంగా "అడవులు – ఆహారం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మన చుట్టుపక్కల ఉన్న వర్షారణ్యాలను కాపాడుకుంటూ, వాటితో కలిసి సహజీవనం చేయడం మన జీవనశైలిలా భాగం కావాలి. వర్షారణ్యాలకు వనభోజనాలా లేదా పర్యాటకాలకు ప్రణాళికలు వేద్దాం.



-డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధిస్తాం -పవన్ కల్యాణ్



విశాఖపట్నం జూన్ 21: యోగా విశిష్టతను రుగ్వేదం చెబితే, మోదీ విశ్వవ్యాప్తంగా యోగాను ప్రోత్సహించారని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖ సాగరతీరంలో ఉదయ భానుడిని స్తుతిస్తూ . తన ప్రసంగం ప్రారంభించిన పవన్ ఇంటర్నేషనల్ యోగా డే భారతావనికి దక్కిన గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. యోగాను అందించిన ఆదియోగి, పతంజలికి నమస్కారాలు తెలియజేశారు. యోగా సాధకులు ఒత్తిడిని జయించి విజయం సాధిస్తారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో యోగాకు ప్రాధాన్యం దక్కుండంలో ప్రధానమంత్రి మోదీదే కీలకపాత్ర అంటూ ప్రశంసించారు.

అంతకు ముందు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపులను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహా పలువురు నేతలు కలిసి విడుదల చేశారు.

రికార్డులే.. రికార్డులు..

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్టణం వేదికగా ఏపీ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2025 కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించింది. ఒకే స్ట్రెచ్‌లో మూడు లక్షల 20వేల మందికిపైగా యోగా చేయడం ప్రపంచంలోనే రికార్డు. దీంతోపాటు 25వేల మంది గిరిజన విద్యార్థులు శుక్రవారం ఒకేచోట చేసిన సూర్య నమస్కారాలకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. ఈ మేరకు గిన్నిస్ రికార్డు ప్రతినిధులు ధ్రువపత్రాలను అందజేశారు.

# 81 చారిత్రక ప్రదేశాల్లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న ఏఎస్ఐ

న్యూఢిల్లీ, జూన్ 21:అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో భారత పురావస్తు సర్వే సంస్థ 81 కేంద్ర రక్షిత స్మారక చిహ్నాల్లో రేపు యోగా దినోత్స వేడుకలు నిర్వహించనుంది. ఈ వేడుకల్లో భాగంగా, ఈ రోజున అన్ని ఏఎస్ఐ స్మారక చిహ్నాలకు ప్రజలందరికీ ఉచిత ప్రవేశం అందిస్తున్నారు.

ఈ సంవత్సరం 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' నినాదంతో భారత సాంస్కృతిక వారసత్వం, ప్రాచీన ఆరోగ్య పద్ధతుల మధ్య కాలాతీత సంబంధాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ యోగా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

2025, మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' ప్రసంగంలో పిలుపునిచ్చిన ఈ నినాదం, మనలో మనం మాత్రమే కాకుండా పర్యావరణంతో కూడా సామరస్యాన్ని పెంపొందించు కోవడంలో యోగా పాత్రను స్పష్టం చేస్తుంది.

పురానా ఖిలా (ఢిల్లీ), గోల్ గుంబజ్ (కర్ణాటక), కోణార్క్ సూర్య దేవాలయం (ఒడిశా), చిత్తోర్‌గఢ్ కోట (రాజస్థాన్), ఎలిఫాంటా గుహలు (మహారాష్ట్ర) సహా ఏఎస్ఐ పరిధిలోని మిగతా 76 చారిత్రక ప్రదేశాల్లో వేలాది మంది యోగా సాధన చేయనున్నారు. ఈ కార్యక్రమాలు యోగా తత్వంతో ముడిపడి ఉన్న సమగ్ర ఆరోగ్యం, పర్యావరణ స్పృహ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తాయి.

అహ్మదాబాద్‌లోని అదలాజ్ వావ్‌లో నిర్వహించే వేడుకలకు కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా.. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ సమాధి ఆవరణలో జరిగే వేడుకలకు పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి.. ముంబయిలోని కన్హేరి గుహల్లో జరిగే వేడుకల్లో వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీ పియూష్ గోయల్.. పట్టడకల్‌లోని దేవాలయాల ఆవరణలో జరిగే వేడుకల్లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖా మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి సహా.. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వేడుకలకు ఇతర ప్రముఖులూ హాజరుకానున్నారు.

ఈ వేడుకల ప్రధాన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా జరు గుతున్న యోగా దినోత్సవ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.ప్రపంచానికి భారత్ అందించిన అనేక గొప్ప కానుకల్లో యోగా ఒకటి. యోగా ప్రాముఖ్యతను గుర్తించి, 2014లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశం జూన్ 21ని అంతర్జాతీ య యోగా దినోత్సవంగా ప్రకటించింది.

# సునీత పార్థివదేహానికి నివాళులర్పించిన జర్నలిస్టులు



ఖమ్మం, జూన్ 21 (నేటినిజం ప్రతినిధి) : సింగరేణి మండలం చీమలపాడు గ్రామానికి చెందిన వీఆర్ఏ కళ్ళోజి శ్రీనివాస్ సతీమణి కళ్ళోజి సునీత అనారోగ్యంతోబాధపడుతూ హైదరాబాద్ లో శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతదేహం శుక్రవారం రాత్రి స్వంత గ్రామం చీమలపాడుకి రాగా విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో చీఫ్ డాక్టర్ బండి కుమార్, రిపోర్టర్ పచ్చిపాల వెంకట్ చీమలపాడు గ్రామానికి వచ్చి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం మృతి చెందిన కళ్ళోజి సునీత భర్త కళ్ళోజి శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకొని వారిని ఓదార్చారు. వారి వెంట ల్యాబ్ శ్రీనివాస్ ఉన్నారు.






# ఒడిశా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా

# రూ. 18,600 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, జూన్ 21::ఒడిశా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు భువనేశ్వర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు. ఒడిశా సమగ్ర అభివృద్ధి పట్ల తన నిబద్ధతకు అనుగుణంగా.. తాగునీరు, నీటిపారుదల, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, గ్రామీణ రహదారులు–వంతెనలు, జాతీయ రహదారుల విభాగాలు, కొత్త రైల్వే లైన్ పనులు సహా కీలక రంగాలకు సంబంధించి, రూ. 18,600 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన శ్రీ నరేంద్ర మోదీ, ఒడిశాలో తొలి బీజేపీ ప్రభుత్వం ఈరోజుతో ఏడాది పాలన పూర్తి చేసుకుందన్నారు. "ఈ వార్షికోత్సవం కేవలం ప్రభుత్వ వార్షికోత్సవం కాదు, ప్రజాసేవ.. ప్రజల విశ్వాసానికి అంకితమైన సుపరిపాలనకు నిదర్శనం" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఒడిశాలోని కోట్లాది మంది ఓటర్ల అంచనాలను అందుకోవడానికి ప్రభుత్వం నిజాయితీగా కృషి చేసిందని ఆయన ప్రశంసించారు. ఒడిశా ప్రజల మద్దతు, విశ్వాసాన్ని ప్రస్తావించిన శ్రీ నరేంద్ర మోదీ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝి, ఆయన సహచర బృందం చేసిన కృషికి అభినందనలు తెలిపారు. వారి ప్రయత్నాలు ఒడిశా అభివృద్ధికి కొత్త ఊపునిచ్చాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

"ఒడిశా కేవలం ఒక రాష్ట్రం మాత్రమే కాదు, ఘనమైన భారత వారసత్వంలో ఒక ధ్రువతార" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. శతాబ్దాలుగా ఒడిశా భారత నాగరికతను, సంస్కృతిని సుసంపన్నం చేసిందన్నారు. అభివృద్ధి, వారసత్వ మంత్రం దేశ పురోగతికి పునాదిగా మారిన నేటి కాలంలో, ఒడిశా పాత్ర మరింత కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సర కాలంలో రాష్ట్ర వారసత్వ పరిరక్షణతో పాటు అభివృద్ధి మంత్రాన్నీ హృదయపూర్వకంగా స్వీకరించిన ఒడిశా.. ఈ మార్గంలో వేగంగా ముందుకు సాగిందని ప్రశంసించారు.

ఒడిశాలో తమ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంలోనే, జగన్నాథుని మహా రథయాత్రకు సన్నాహాలు ప్రారంభం కావడం యాదృచ్ఛికమే అయినా శుభప్రదమని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. జగన్నాథుడు కేవలం పూజనీయుడు మాత్రమే కాదు, అపారమైన ప్రేరణకు మూలమని పేర్కొన్నారు. భగవంతుని అనుగ్రహం కారణంగా శ్రీ మందిరానికి సంబంధించిన సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని ఆయన తెలిపారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను గౌరవించిన శ్రీ మోహన్ మాఝిని, ఆయన ప్రభు త్వాన్ని ప్రధానమంత్రి అభినందించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే శ్రీ మందిరం నాలుగు ద్వారాలు తెరుచుకున్నాయన్నారు. ఆలయ రత్న భాండాగారాన్ని తెరవడం రాజకీయ విజయానికి సంబంధించిన విషయం కాదనీ, కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని గుర్తించే గౌరవప్రదమైన చర్య అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈరోజు జగన్నాథుని పవిత్ర భూమిని సందర్శించాలని ముందు గానే ప్రణాళిక చేసుకున్నందున.. కెనడాలో జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశం పూర్తయిన తర్వాత అమెరికాను సందర్శించాలని కోరిన ఆ దేశ అధ్యక్షుడి ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించినట్లు ప్రధానమంత్రి తెలిపారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దశాబ్దాల పాటు దేశ ప్రజలు మంచి పరిపాలన లేని, ప్రజల జీవితాలను ఏమాత్రం సులభతరం చేయని పాలనా నమూనాను చూశారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులను ఆలస్యం చేయడం, అడ్డుకోవడం, పాలన గాడి తప్పడం, అత్యంత అవినీతికి పాల్పడడం గత పాలన నమూనా అని విమర్శించారు. అలాంటి అధ్వాన్నమైన పాలనే వారి అభివృద్ధి నమూనాకు ముఖ్య లక్షణమని పేర్కొన్నారు. ఇటీవల గత కొద్ది సంవత్సరాలుగా దేశం మా అసలైన అభివృద్ధి నమూనాను చూస్తోందన్నారు. గత దశాబ్దంలో, అనేక రాష్ట్రాల్లో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. సుపరిపాలనతో పాటు.. ఈ రాష్ట్రాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి విషయంలో నవశకం ప్రారంభమైందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. తూర్పు భారత్ ఉదాహరణను ఉటంకిస్తూ, దశాబ్దం కిందట అస్సాం అస్థిరత, వేర్పాటువాదం, హింసతో నిండి ఉండేదని ప్రధానమంత్రి తెలిపారు. నేడు అస్సాం సరికొత్త అభివృద్ధి మార్గంలో పురోగమిస్తోందన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న తిరుగుబాటు కార్యకలాపాలు ఇప్పుడు ఆగిపోయాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అస్సాం ఇప్పుడు అనేక అంశాల్లో దేశంలోని అనేక ఇతర రాష్ట్రాలను అధిగమిస్తోందని స్పష్టం చేశారు. త్రిపుర గురించి ప్రస్తావిస్తూ.. దశాబ్దాల వామపక్ష పాలన తర్వాత ఆ రాష్ట్ర ప్రజలు తమ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. వామపక్ష పాలనలో త్రిపుర ప్రతి అభివృద్ధి సూచీలోనూ వెనుకబడి ఉండేదని, మౌలిక సదుపాయాలు శిథిలావస్థకు చేరాయని, ప్రభుత్వ వ్యవస్థ ప్రజా సమస్యలకు స్పందించే పరిస్థితి కూడా లేదని తెలిపారు. హింస, అవినీతితో ప్రజలు ఇబ్బంది పడేవారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. నేడు త్రిపుర శాంతి, పురోగతికి చిహ్నంగా ఎదుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

ఒడిశా కూడా దశాబ్దాలుగా అనేక సవాళ్లతో సతమతమవుతోందని ప్రస్తావించిన ప్రధానమంత్రి.. పేదలు, రైతులు వారి హక్కులు కూడా పొందలేదని పేర్కొన్నారు. అవినీతి, రెడ్–టేపిజం ఆధిపత్యం ఉండేదని, రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు దారుణమైన స్థితిలో ఉండేవన్నారు. ఒడిశాలోని అనేక ప్రాంతాలు అభివృద్ధి ప్రక్రియలో వెనుకబడిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటువంటి సవాళ్లు ఒడిశాకు దురదృష్టకర వాస్తవంగా మారాయని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. అయితే గత ఏడాది కాలంగా ఈ సమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం పూర్తి సంకల్పంతో పనిచేసిందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి అభివృద్ధి నమూనా స్పష్టమైన ఫలితాలను అందించడం ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి విధానాల ప్రభావాన్ని ప్రతిబింబిస్తాయని ప్రధానమంత్రి తెలిపారు. ఈ నమూనా ఒడిశా ప్రజలకు రెట్టింపు ప్రయోజనాలను కలిగించిందని ఆయన పేర్కొన్నారు. ఒడిశాలోని లక్షలాది పేద కుటుంబాలు చాలా కాలంగా ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి రాలేదని శ్రీ నరేంద్ర మోదీ గుర్తు చేశారు. నేడు ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన, గోపబంధు జన్ ఆరోగ్య యోజన రెండూ కలిసి పనిచేస్తున్న ఉదాహరణను ఆయన ఉటంకించారు. దీని వల్ల ఒడిశాలోని దాదాపు 3 కోట్ల మందికి ఉచిత వైద్య చికిత్స లభిస్తోందన్నారు. ఒడిశాలోని ఆసుపత్రుల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ ప్రయోజనం అందుబాటులో ఉందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు చికిత్స పొందిన ఒడిశాలోని 2 లక్షల మందిలో.. చాలా మంది దజనుకు పైగా ఇతర రాష్ట్రాల్లో ఉచిత చికిత్స పొందారని ఆయన పేర్కొన్నారు. కేవలం ఒక సంవత్సరం క్రితం ఇటువంటి వైద్య సదుపాయాన్ని ప్రజలు ఊహించలేదన్నారు. ప్రధానమంత్రి వయ వందన యోజన వంటి కార్యక్రమాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నమూనా మరింత విలువను తెచ్చిందని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఒడిశాలో 70 ఏళ్లు పైబడిన 23 లక్షలకు పైగా వృద్ధులు ఇప్పుడు ఈ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్సకు అర్హులయ్యారని ఆయన పేర్కొన్నారు. ఇది సాధారణ మధ్యతరగతి కుటుంబాల వైద్య చికిత్సల భారాన్ని గణనీయంగా తగ్గించిందని తెలిపారు. అదేవిధంగా ఒడిశాలోని రైతులు గతంలో పీఎం–కిసాన్ పథకం పూర్తి ప్రయోజనాన్ని పొందలేదన్నారు. ఇప్పుడు కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ పథకాల నుంచి రైతులు రెట్టింపు ప్రయోజనాలను పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ ధరలను పెంచేందుకు హామీ ఇచ్చిందన్న ప్రధానమంత్రి, ఇది ఒడిశాలోని లక్షలాది వరి రైతులకు ప్రయోజనం చేకూర్చిందని తెలిపారు.

గతంలో ఒడిశా పూర్తి ప్రయోజనాలు పొందలేని అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నాయని, కానీ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు రెండింటినీ ప్రజలు పొందుతున్నారని ప్రధాని ఉద్ఘాటించారు. మహిళలు, రైతులు, యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేశామన్నారు

అణగారిన వర్గాల సాధికారత ప్రభుత్వ ప్రధాన విజయమని స్పష్టం చేస్తూ, ఒడిశాలో పెద్ద సంఖ్యలో గిరిజన జనాభా నివసిస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. గతంలో గిరిజన సమాజం వెనుకబాటుతనం, పేదరికం, అణచివేతతో నిరంతరం నిర్లక్ష్యానికి గురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన పార్టీ గిరిజన ప్రజలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుందని, వారికి అభివృద్ధిని అందించలేదని, అభివృద్ధిలో గిరిజన వర్గాలకు భాగస్వామ్యాన్ని కల్పించలేదని ప్రధాని వ్యాఖ్యానించారు. వారు దేశంలోని విస్తారమైన ప్రాంతాలను నక్సలిజం, హింస, అణచివేత జ్వాలల్లోకి నెట్టారని ఆయన ఆరోపించారు.

2014కు ముందు దేశవ్యాప్తంగా 125కు పైగా గిరిజన మెజారిటీ జిల్లాలు నక్సలైట్ హింసతో ప్రభావితమయ్యాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. 'రెడ్ కారిడార్' పేరుతో గిరిజన ప్రాంతాలపై అన్యాయంగా చెడు ముద్ర వేసి కించపరిచారని అన్నారు. వీటిలో చాలా జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించారని, ఆ తర్వాత గత పాలకులు వాటిని పట్టించుకోలేదని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో గిరిజన సమాజాన్ని హింసాత్మక వాతావరణం నుంచి తప్పించి నూతన అభివృద్ధి స్రవంతిలోకి తీసుకురావడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హింసను వ్యాప్తి చేసే వారిపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని ప్రధాని తెలిపారు. అదే సమయంలో గిరిజన ప్రాంతాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టామని, ఫలితంగా నక్సలైట్ హింస ప్రభావం దేశంలో 20 కంటే తక్కువ జిల్లాలకు పరిమితమైందని ఆయన అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్యలతో గిరిజన సమాజాలు త్వరలోనే హింస బారి నుంచి విముక్తి పొందుతా యని, దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

''గిరిజన వర్గాల కలలను నెరవేర్చడం, వారికి కొత్త అవకాశాలను కల్పించడం, వారి జీవితంలో ఇబ్బందులను తగ్గించడం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రెండు ప్రధాన జాతీయ పథకాలను తొలిసారిగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల కోసం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని ప్రధాని పేర్కొన్నారు. మొదటి పథకం ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద దేశవ్యాప్తంగా 60,000కుపైగా ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రధానమంత్రి తెలిపారు. ఒడిశాలో కూడా గిరిజన కుటుంబాలకు ఇళ్లు నిర్మిస్తున్నామని, రోడ్లు నిర్మిస్తున్నామని, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఒడిశాలోని 11 జిల్లాల్లో 40 రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటి కోసం కేంద్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు.

రెండో ప్రధాన పథకమైన ప్రధానమంత్రి జన్ మన్ యోజన గురించి వివరిస్తూ, ఈ పథకానికి ప్రేరణ ఒడిశా భూమి నుంచి ఉద్భవించిందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రూపొందించడంలో దేశ తొలి గిరిజన మహిళా రాష్ట్రపతి, ఒడిశా కుమార్తె శ్రీమతి ద్రౌపది ముర్ము మార్గదర్శకత్వాన్ని ఆయన ప్రస్తావించారు. విస్తృత గిరిజన సమాజంలోని ముఖ్యంగా బలహీన గిరిజన సమూహాలకు (పివిటిజి) మద్దతు ఇవ్వడంపై ఈ పథకం దృష్టి సారించిందని ప్రధానమంత్రి తెలియచేశారు. ఈ పథకం కింద అనేక చిన్న గిరిజన తండాల్లో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఒడిశాలో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు నివసిస్తున్నారని, వారి సంక్షేమం కోసం తొలిసారిగా దేశవ్యాప్తంగా పీఎం మత్స్య సంపద యోజన అనే బృహత్తర పథకాన్ని రూపొందించినట్లు ప్రధాన మంత్రి గుర్తు చేశారు. మత్స్యకారులు ఇప్పుడు కిసాన్ క్రెడిట్ కార్డు సదుపాయం కూడా పొందుతున్నారని ఆయన చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం రూ.25, 000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తోందని, ఇది ఒడిశా తీరప్రాంతంలో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరు స్తుందని, యువతకు అవకాశాలను కల్పిస్తుందని ప్రధాని ప్రకటించారు.

# లోకేష్‌కు ప్రధాని ప్రశంసలు..



విశాఖపట్నం జూన్ 20: ఏపీ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర-2025' కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ సందర్భంగా.. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేడు విశాఖ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించింది. 3.01 లక్షల మంది ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ నేపథ్యంలో నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేష్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని కొనియాడారు ప్రధాని మోదీ . ఇదే సమయంలో.. 'యోగా కేవలం వ్యాయామం కాదు.. అదొక జీవన విధానం.. ఈ ఏడాది విశాఖలో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం అద్భుతం' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

దీనిపై స్పందించిన నారా లోకేష్ విశాఖలో యోగాంధ్ర నిర్వహణపై సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రుల కోరికలను ప్రధాని నెరవేరుస్తున్నారని.. ఆయనకు గిన్నిస్ రికార్డు కానుక ఇవ్వాలని యోగాంధ్ర నిర్వహించినట్లు తెలిపారు. ఆశించిన దానికంటే ఎక్కువ మంది యోగాంధ్రకు వచ్చారని లోకేష్ అన్నారు. ప్రజల్లో వచ్చిన చైతన్యం వల్లే యోగాంధ్ర ఈ స్థాయిలో విజయవంతం అయ్యిందని.. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారని అన్నారు. ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేయడం వల్లే.. ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని అన్నారు..

ప్రధాని వ్యాఖ్యలు తనపై మరింత బాధ్యతలను పెంచాయని.. యోగాంధ్ర కార్యక్రమం ఆంధ్రుల విజయ అని లోకేష్ పేర్కొన్నారు. ఇదే సమయంలో? పరిపాలనా సౌలభ్యం కోసం రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేశామని చెప్పిన లోకేష్.. అన్ని ప్రాంతాలకు అభివృద్ధిని వికేంద్రీకరిస్తామని.. దక్షిణ భారత్ లో ఉన్నతమైన ఐటీ హబ్ గా విశాఖను తీర్చిదిద్దుతామని అన్నారు. విశాఖలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# బీహార్ అభివృద్ధి చెందుతుంది.. దేశాభ్యుదయంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది: పీఎం

న్యూఢిల్లీ, జూన్ 21:బీహార్లోని సివాన్లో రూ.5,200 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈ రోజు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. బాబా మహేంద్రనాథ్, బాబా హన్స్‌నాథ్‌లను స్మరించుకున్నారు. అలాగే పవిత్రమైన సోగర ధామ్ ప్రాశస్త్యాన్ని గుర్తుచేశారు. థావే భవానీ మాత, అంబికా భవానీ మాతకు వందనం సమర్పించారు. దేశానికి తొలి రాష్ట్రపతిగా సేవలందించిన దేశరత్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, లోక నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను ఆయన గౌరవపురస్సరంగా తలచుకున్నారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో స్ఫూర్తిగా నిలిచిన ప్రాంతంగా సివాన్‌ను శ్రీ మోదీ వర్ణించారు. ఈ భూమి దేశ ప్రజాస్వామ్యానికి సాధికారత కల్పించిందని, రాజ్యాంగాన్ని బలోపేతం చేసిందని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ రచనలోనూ, దేశానికి దిశానిర్దేశం చేయడంలోనూ కీలకంగా వ్యవహరించిన డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ లాంటి గొప్ప పుత్రుడిని సివాన్ అందించిందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సామాజిక సంస్కర్త బ్రజ్ కిశోర్ ప్రసాద్ రూపంలో సివాన్ సహకారం అందించిందని ప్రధానమంత్రి అన్నారు.

ఆ గొప్ప వ్యక్తుల లక్ష్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృఢమైన సంకల్పంతో ముందుకు తీసుకెళుతున్నాయని శ్రీ మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ రోజు నిర్వహిస్తున్న కార్యక్రమం కూడా ఆ నిరంతర ప్రయత్నాల్లో ఒక భాగమేనని అన్నారు. ఒకే వేదిక నుంచి వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించామని, మరికొన్నింటికి శంకుస్థాపన చేశామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఉజ్వల భవిష్యత్తు దిశగా బీహార్‌ను నడిపిస్తాయని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సహకరిస్తాయని వివరించారు. సివాన్, ససారాం, బక్సర్, మోతీహారీ, బేతియా, ఆరా లాంటి ప్రాంతాల అభివృద్ధిలో ఈ ప్రాజెక్టులు కీలకపాత్ర పోషిస్తాయని శ్రీ మోదీ అన్నారు. ఈ కార్యక్రమాలన్నీ పేదలు, అణగారిన వర్గాల వారు, దళితులు, మహాదళితులు, వెనకబడిన, అత్యంత వెనకబడిన వర్గాల వారి జీవితాలను సులబతరం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల విషయంలో బీహార్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

విదేశాల నుంచి నిన్ననే తిరిగి వచ్చానని శ్రీ మోదీ చెబుతూ ఈ పర్యటనలో అభివృద్ధి చెందిన దేశాల నాయకులతో తాను భేటీ అయినట్లు తెలిపారు. భారత్‌లో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రపంచ నాయకులు ముగ్ధులయ్యారని వెల్లడించారు. ఈ నాయకులంతా భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని భావిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిలో బీహార్ కీలకపాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. "అభివృద్ధి చెందిన బీహార్ దేశ సమగ్రాభివృద్ధికి గణనీయమైన సహకారం అందిస్తుంది" అని శ్రీ మోదీ తెలియజేశారు. బీహార్ ప్రజల బలం, సామర్థ్యాలపై విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అరాచక పాలనను పారదోలిన ప్రజలను ప్రధానమంత్రి అభినందించారు. రెండు దశాబ్దాల కిందటి నాటి పరిస్థితిని ప్రస్తుత యువత కథల రూపంలో తెలుసుకుంటున్నారని చెప్పారు. అరాచక పాలన సమయంలో జరిగిన నష్టాన్ని వారు పూర్తిగా గ్రహించలేకపోవచ్చని చెబుతూనే.. శతాబ్దాల పాటు భారత దేశ పురోగమనంలో కీలకపాత్ర వహించిన ఉన్న బీహార్.. గత పాలకుల కారణంగా బలవంతపు వలసలకు చిహ్నంగా మారిందని వ్యాఖ్యానించారు.

బీహార్లో ప్రతి పౌరునికీ ఆత్మగౌరవం అత్యంత ముఖ్యమైన అంశమని ప్రధాని అన్నారు. బీహారీ సోదర సోదరీమణులు అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తూ, విజయం సాధిస్తున్నారని ప్రశంసించారు. వారు తమ ఆత్మగౌరవం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడరని పేర్కొన్నారు. అయితే, గత పాలకులు బీహార్ ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బ తీశారని విమర్శించారు. ఈ అవినీతి పాలన బీహార్‌ను పేదరికంలోకి నెట్టిందని ఆరోపించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ, శ్రీ నితీష్ కుమార్ సారథ్యంలోని ప్రస్తుత ప్రభుత్వం బీహార్‌ను తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత 10-11 ఏళ్లలో సుమారుగా 55,000 కి.మీ మేర గ్రామీణ రహదారులు నిర్మాణమయ్యాయని పేర్కొన్నారు. 1.5 కోట్ల గృహాలకు విద్యుత్ సౌకర్యం, మరో 1.5 కోట్ల గృహాలకు కుళాయి సదుపాయం కల్పించామని వెల్లడించారు. రాష్ట్రంలో 45,000కి పైగా సాధారణ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారని శ్రీ మోదీ గుర్తించారు. బీహార్లోని చిన్న పట్టణాల్లో కొత్త అంకుర సంస్థలు ఏర్పాటవుతున్నాయని ఆయన వెల్లడించారు.

బీహార్ అభివృద్ధి వేగం పుంజుకుంటోందన్న శ్రీ మోదీ.. గతంలో అరాచకాలకు కారణమైన శక్తులు ఇప్పుడు ప్రభుత్వంపై, బీహార్ ఆర్థిక వనరులపై మళ్లీ అధికారాన్ని పొందాలనుకుంటున్నాయని హెచ్చరించారు. అధికారం కోసం ఈ శక్తులు కుటిల వ్యూహాలు పన్నుతున్నాయని విమర్శించారు. బీహార్ ప్రజలు జాగరూకులుగా ఉండాలని ఆయన కోరారు. సుసంపన్నమైన రాష్ట్రంగా అవతరించే దిశగా బీహార్ దిశగా ప్రస్థానాన్ని పక్కదారి పట్టించేందుకు కాచుకొని ఉన్న వారిని దూరం పెట్టాలని ప్రధానమంత్రి కోరారు.

దేశంలో పేదరిక నిర్మూలన నినాదాలు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయని, అయితే తమ ప్రభుత్వం దాన్ని నిజం చేసి చూపిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. "గత దశాబ్ద కాలంలో రికార్డు స్థాయిలో 25 కోట్ల భారతీయులు పేదరికాన్ని అధిగమించారు" అని శ్రీ మోదీ వివరించారు. ప్రపంచ బ్యాంకు వంటి ప్రఖ్యాత సంస్థలు భారత్ సాధించిన విజయాన్ని ప్రశంసించాయని గుర్తుచేశారు. దేశం సాధించిన ఈ విజయంలో బీహార్, ముఖ్యంగా నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వమూ గణనీయమైన పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. బీహార్ ప్రజల్లో సగానికిపైగా కటిక బీదరికంలో కూరుకుపోయారని గతంలో ప్రధానమంత్రే చెప్పారు. అయితే గత పదేళ్లలో ఈ రాష్ట్రంలో దాదాపు నాలుగు కోట్ల ప్రజలు పేదరికాన్ని అధిగమించారు.

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా లక్షలాది మంది భారతీయులు నిరుపేదలుగానే మిగిలిపోయారంటే.. దానికి వారి కృషి లోపించడం కారణం కాదని, పురోగమించే అవకాశాలు ప్రజలకు లేకపోవడం వల్లేనని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో సుదీర్ఘకాలంపాటు కొనసాగిన 'లైసెన్స్ రాజ్' వ్యవస్థ వల్ల దేశం పేదరికాన్ని అధిగమించలేకపోయిందని శ్రీ మోదీ చెప్పారు. ఆ సమయంలో ప్రతి సేవ, ప్రతి అవకాశంపైనా కోటా- పర్మిట్ వ్యవస్థ ఉండేవని, చిన్నచిన్న పనులకు కూడా అనుమతులు అవసరముండేవని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాల పాలనలో పేదలకు గృహవసతీ దక్కలేదని, రేషన్ సరుకులను కూడా మధ్యవర్తులు పక్కదారి పట్టించేవారని ప్రధానమంత్రి అన్నారు. పేదలకు వైద్యం అందలేదన్నారు. విద్య, ఉపాధి నిత్య పోరాటాలుగానే ఉండిపోయాయంటూ విమర్శించారు. విద్యుత్ కనెక్షనో లేదా నీటి కనెక్షనో అయినా పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. గ్యాస్ కనెక్షన్ పొందాలంటే ఎంపీ సిఫార్సు చేయాల్సి వచ్చేదనీ.. లంచాలో, పలుకుబడో లేకుండా ఉద్యోగాలు వచ్చేవి కావని చెప్పారు. ప్రధానంగా దళిత, మహాదళిత, వెనుకబడిన, అత్యంత వెనుకబడిన వర్గాల వ్యక్తులే ఈ వ్యవస్థ వల్ల అత్యంత ప్రతికూలంగా ప్రభావితులయ్యారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన కోసం ఈ వర్గాలను కలల్లో ముంచెత్తుతూ, ఈ క్రమంలో కొన్ని కుటుంబాలే కోట్లకు పడగలెత్తాయని శ్రీ మోదీ విమర్శించారు.

''గత 11 ఏళ్లుగా తమ ప్రభుత్వం పేదల బాటలో ప్రతి అవరోధాన్నీ తొలగించేందుకు కట్టుబడి వ్యవహరించిందన్నారు. ఫలితంగా స్పష్టమైన, ప్రభావవంతమైన ఫలితాలు వస్తున్నాయి" అని శ్రీ మోదీ అన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు లభించాయని, ముమ్ముందు మరో 3 కోట్ల గృహాలను నిర్మించబోతున్నామని చెప్పారు. ఇది బీహార్‌లోని పేదలు, దళితులు, మహాదళితులు, వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన కుటుంబాలకు విశేషంగా ప్రయోజనం చేకూర్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద ఒక్క బీహార్‌లోనే 57 లక్షలకు పైగా పక్కా ఇళ్లు నిర్మించామన్నారు. సివాన్ జిల్లాలో పేదల కోసం ఇప్పటికే 1.10 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించామని, ఎలాంటి అంతరాయం లేకుండా ఈ పనులు కొనసాగుతున్నాయని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. బీహార్‌లో 50వేలకు పైగా కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఇళ్లలో ఎక్కువ శాతం తల్లులూ, అక్కాచెల్లెళ్ల పేరిటే రిజిస్టర్ కావడం ఎంతో సంతోషాన్నిస్తోందని శ్రీ మోదీ ప్రత్యేకంగా పేర్కొన్నారు. సాంప్రదాయకంగా ఎప్పుడూ తమ పేరిట ఎలాంటి ఆస్తులూ లేని మహిళలు ఇప్పుడు ఇంటి యజమానులుగా గర్వించదగ్గ స్థాయిలో నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం పేదలకు గృహనిర్మాణమే కాకుండా ఉచిత రేషన్, విద్యుత్, నీటి సౌకర్యాలను కూడా అందిస్తోందని, కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా 12 కోట్లకు పైగా కొత్త గృహాలకు కుళాయి నీటిని అందించామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఒక్క సివాన్ జిల్లాలోనే 4.5 లక్షల కుటుంబాలకు తొలిసారిగా కుళాయి నీరు అందిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లను, పట్టణ ప్రాంతాల్లో సరిపడా తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇటీవల బీహార్‌లోని వివిధ నగరాల్లో పలు పైప్‌లైన్లు, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులను చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాగా, ఇప్పుడు పదుల సంఖ్యలో పట్టణాల్లో కొత్త పైప్ లైన్, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు మంజూరయ్యాయని తెలిపారు. "ఈ ప్రాజెక్టులన్నీ పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన నాణ్యతను గణనీయంగా పెంచుతాయి" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ ట్రాక్ రికార్డును తీవ్రంగా విమర్శించిన శ్రీ మోదీ.. ఎప్పుడూ బీహార్‌కూ పెట్టుబడులకూ వ్యతిరేకంగానే వారు వ్యవహరించారని దుయ్యబట్టారు. ఈ పార్టీలు అభివృద్ధి గురించి మాట్లాడితే.. తాళాలు వేసిన దుకాణాలు, నిలిచిపోయిన వ్యాపారాలు, దెబ్బతిన్న పరిశ్రమలే ప్రజలకు గుర్తొస్తున్నాయని విమర్శించారు. అందుకే అలాంటి పార్టీలు బీహార్ యువత నమ్మకాన్ని పొందలేకపోయాయన్నారు. చాలాకాలం పాటు సాగిన ఈ పార్టీల పాలనలో మౌలిక సదుపాయాలు శిథిలమయ్యాయనీ.. మాఫియా పాలనను, అరాచకాలను, అవినీతిని అవి ప్రోత్సహించాయని ఆయన విమర్శించారు.

ప్రతిభావంతులైన బీహార్ యువత క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులన్నింటినీ నిశితంగా గమనిస్తూ, విశ్లేషిస్తున్నారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. బీహార్‌లో ఎన్డీయే అభివృద్ధి నమూనాకు మర్హౌరా లోకోమోటివ్ ఫ్యాక్టరీని ముఖ్యమైన ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. మర్హౌరా ఫాక్టరీలో తయారైన మొదటి ఇంజిన్‌ను ఆఫ్రికాకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిపిన ప్రధానమంత్రి, ఇదొక చరిత్రాత్మక ఘట్టమన్నారు. గత ప్రభుత్వ హయాంలో వెనుకబడిన ప్రాంతంగా అభివృద్ధికి దూరమైన సరన్ జిల్లాలో ఈ ఫ్యాక్టరీ ఉందని, ఇప్పుడీ జిల్లాకు ప్రపంచ తయారీ, ఎగుమతి వ్యవస్థలో చోటు దక్కిందని శ్రీ మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు బీహార్ అభివృద్ధి పథానికి అవరోధాలను సృష్టించాయని విమర్శించారు. అయితే, నేడు బీహార్‌లో తయారైన ఇంజిన్ ఆఫ్రికాలో రైళ్లను పరుగులు పెట్టిస్తోందని వ్యాఖ్యానించారు. ఇది మనందరికీ గర్వకారణమన్నారు. 'మేడిన్ ఇండియా' తయారీకి ప్రధాన కేంద్రంగా బీహార్ అవతరిస్తుందని ప్రధానమంత్రి ధీమా వ్యక్తం చేశారు. మఖానా, పండ్లు, కూరగాయల వంటి స్థానిక ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరడమే కాకుండా, బీహార్ కర్మాగారాల్లో తయారయ్యే వస్తువులకు కూడా ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుందన్నారు. "బీహార్ యువత చేసిన ఉత్పత్తులు ఆత్మనిర్భర భారత లక్ష్యాన్ని బలోపేతం చేస్తాయి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

బీహార్ లో ప్రస్తుతం అభివృద్ధి పరుస్తున్న మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రగతికి ఇతోధికంగా దోహదపడతాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, రైళ్ళు, వైమానిక సేవలు, జలమార్గాల రంగాల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. వందే భారత్ వంటి అత్యాధునిక రైళ్ళు సహా బీహార్ కు అనేక కొత్త రైలు సర్వీసులు అందుతున్నాయని చెప్పారు. శ్రావణమాసం మొదలు కాక ముందే బాబా హరిహరనాథ్ ప్రాంతాన్ని బాబా గోరఖ్ నాథ్ ప్రాంతంతో అనుసంధానించే కొత్త వందే భారత్ రైలు మొదలయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. కొత్తగా ప్రారంభించిన పాట్నా-గోరఖ్ పూర్ వందే భారత్ రైలు ద్వారా పూర్వాంచల్ భక్తులు ఆధునిక సౌకర్యాలను పొందగలుగుతారని సంతోషం వ్యక్తం చేశారు. ఇదే రైలు బుద్ధ భగవానుడు తపస్సు చేసిన చోటు, ఆయన మహానిర్వాణం చెందిన కుషినగర్ ప్రాంతాల మధ్య కీలక అనుసంధాన మార్గంగా ఉంటుందని చెప్పారు.

ప్రభుత్వ కృషి వల్ల పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊపు లభించడమే కాక, రాష్ట్ర పర్యాటక రంగానికి లబ్ధి చేకూరగలదని చెప్పారు. కొత్త ప్రాజెక్టుల వల్ల బీహార్ ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక స్థానం దక్కించుకుని, రాష్ట్ర యువతకు ఇబ్బడిముబ్బడిగా ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు.

అందరికీ సమాన అవకాశాలు కల్పించి, వివక్షను దూరం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనం కాగా, 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' అనే నినాదంతో ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తోందని చెప్పారు. అయితే గత ప్రభుత్వాలు 'సొంత కుటుంబాలకే' ప్రాముఖ్యాన్నిచ్చి, సొంత లాభం ధ్యేయంగా పనిచేశాయని విమర్శించారు. తమ కుటుంబాల బాగుకే ప్రాముఖ్యాన్నిచ్చిన ఆ పార్టీలు బీహార్ సహా దేశంలోని లక్షలాది రైతు కుటుంబాల ప్రయోజనాలను దెబ్బతీశాయని ఆరోపించారు.

కుటుంబపాలనను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ వ్యతిరేకించేవారని, ఆయా పార్టీలు బాబా సాహెబ్ ఆశయానికి అనేకసార్లు తూట్లుపొడిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పార్టీ ప్రమేయమున్న సంఘటనలో బాబా సాహెబ్ ఫోటోకి అవమానం జరిగినట్లు వెల్లడైందని, సంఘటన పట్ల స్పందన తెలియజేస్తూ, సదరు పార్టీ క్షమాపణ చెప్పాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు వెలిశాయని గుర్తుచేశారు. దళితుల పట్ల, మహాదళితుల పట్ల ఎంత మాత్రం గౌరవం లేని ఆ పార్టీలు క్షమాపణ చెప్పగలవన్నది సందేహాస్పదమేనన్నారు. అంబేద్కర్ చిత్రాన్ని గత పాలకులు వారి పాదాల వద్ద ఉంచారనీ, అయితే తాను అంబేద్కర్ ను తన హృదయంలో నిలుపుకున్నట్లు చెప్పారు. అంబేద్కర్ ను అవమానించడం ద్వారా ఆయన కన్నా అధికులమని వారు భావిస్తున్నారని ఆరోపించిన శ్రీ మోదీ... బాబా సాహెబ్ కు జరిగిన ఈ అవమానాన్ని బీహార్ ప్రజలు ఎన్నటికీ మరచిపోరని చెప్పారు.

బీహార్ ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు అవసరమైన పునాదులని శ్రీ నితీశ్ కుమార్ నిర్మించారని, ఇక రాష్ట్రాన్ని నూతన శిఖరాలకు చేర్చేందుకు రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. బీహార్ యువతపై తనకు పరిపూర్ణమైన విశ్వాసం ఉందని, రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కలిసికట్టుగా పని చేసి, దేశఅభివృద్ధిలో రాష్ట్రాన్ని చోదకశక్తిగా మార్చడం ఖాయమన్నారు. ప్రస్తుతం అమలవుతున్న అభివృద్ధి పనులన్నీ సజావుగా సాగాలని కోరుకుంటూ శ్రీ మోదీ తమ ప్రసంగాన్ని ముగించారు.

బీహార్ గవర్నర్ శ్రీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి శ్రీ నితీశ్ కుమార్, కేంద్రమంత్రులు శ్రీయుతులు రాజీవ్ రంజన్ సింగ్, జితన్ రామ్ మాంఝీ, గిరిరాజ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, నిత్యానంద్ రాయ్, రామనాథ్ ఠాకూర్, సతీష్ చంద్ర దూబే, డాక్టర్ రాజ్ భూషణ్ చౌధరి ఇతర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీహార్ లో మౌలిక వసతుల అభివృద్ధికి, సామాజిక-ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే లక్ష్యంతో ప్రధానమంత్రి సివాన్ లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

బీహార్ లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడే రూ. 400 కోట్లు విలువ చేసే నూతన వైశాలి-దేవరియా రైల్వే లైన్ ప్రాజెక్టును, ఇదే మార్గంలో మరో కొత్త రైలు సర్వీస్ ను శ్రీ మోదీ ప్రారంభించారు. అదే విధంగా ఉత్తర బీహార్‌లో రవాణా సదుపాయాల మెరుగుదలకు దోహదపడే పాటలీపుత్ర?గోరఖ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ రైలు ముజఫర్‌పూర్ బేతియా మార్గం ద్వారా ప్రయాణిస్తుంది.

"మేక్ ఇన్ ఇండియా ? మేక్ ఫర్ ది వరల్డ్" ఆశయానికి మరింత ఊతమిచ్చే విధంగా, గినీ దేశానికి ఎగుమతి నిమిత్తం మర్హౌరా కేంద్రంలో తయారైన అత్యాధునిక రైలింజన్ ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ కేంద్రంలో తొలిసారిగా, ఎగుమతే లక్ష్యంగా రైలింజన్ తయారైంది. అధిక హార్స్ పవర్ ఇంజిన్లు, అత్యాధునిక ఏ.సి. ప్రొపల్షన్ సిస్టమ్స్, మైక్రోప్రాసెసర్ ఆధారిత కంట్రోల్ సిస్టమ్స్, సుఖవంతమైన క్యాబ్ డిజైన్లు, రీజెనరేటివ్ బ్రేకింగ్ వంటి సాంకేతికతను ఈ ఇంజిన్లు కలిగి ఉన్నాయి.

గంగానది ప్రక్షాళన లక్ష్యంగా నమామి గంగే ప్రాజెక్టు కింద స్థానికులకు ఉపయోగపడే రూ. 1,800 కోట్ల విలువైన ఆరు మురుగునీటి శుద్ధి కర్మాగారాలను (ఎస్టీపీ) ప్రధానమంత్రి ప్రారంభించారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో బీహార్ లోని పలు నగరాలు, పట్టణాల్లో రూ. 3,000 కోట్లు విలువైన నీటి సరఫరా, పారిశుధ్య, ఎస్టీపీ లకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు చేశారు.

బీహార్‌లో ఇంధన రంగ అభివృద్ధి కోసం 500 మెగావాట్ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్)కు శ్రీ మోదీ శంకుస్థాపన చేశారు. ముజఫర్‌పూర్, మోతీహారీ, బేతియా, సివాన్ సహా మొత్తం 15 గ్రిడ్ సబ్‌స్టేషన్లలో బీఈఎస్ఎస్ లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో 20 నుంచి 80 మెగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీలుంటాయి. దాంతో పంపిణీ సంస్థలు ఖరీదైన రేట్లకు విద్యుత్‌ను కొనుగోలు చేయవలసిన అవసరం లేకుండా, నిలువ చేసిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు పంపగలుగుతాయి. తద్వారా వినియోగదారులకు లాభం చేకూరుతుంది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ (పీఎంఏవై - యూ) కింద బీహార్ లోని 53,600 మంది లబ్ధిదారులకు శ్రీ మోదీ మొదటి విడత సొమ్ముని విడుదల చేశారు. ఇదే పథకంలో భాగంగా 6,600 మందికి కొత్త ఇళ్ళ గృహప్రవేశానికి సంబంధించి తాళం చెవులను అందజేస్తారు.

## నాషా ముక్త్ భారత్ అభియాన్ కింద వారం రోజుల కార్యకలాపాలు : కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్, జూన్ 21:నాషా ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లా స్థాయిలో వారం రోజుల మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యకలాపాలు కోసం ప్రభుత్వం ద్వారా సమగ్ర ప్రణాళికను రూపొందించిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ క్రీడా పోటీలు మహిళలకు నిర్వహించారు. అనంతరం విద్యార్థినీలకు బస్తా జంప్ గేమ్ వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.

ఈ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ప్రహరీ క్లబ్‌లు, సంబంధిత జిల్లాల్లోని వారం రోజులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మన జిల్లాలో ఈరోజు క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, వివిధ జిల్లా అధికారులు, సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ శివసుబ్రమణియన్ రామన్

న్యూఢిల్లీ, జూన్ 21:పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ - డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఛైర్‌పర్సన్‌గా శ్రీ శివసుబ్రమణియన్ రామన్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. భారత ప్రభుత్వం 2025, ఏప్రిల్ 8న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఆయనను అయిదు సంవత్సరాల పదవీకాలానికి ఛైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అయిదేళ్లు లేదా ఆయనకు 65 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు, వీటిలో ఏది ముందుగా జరిగితే ఆ రోజు వరకు శివసుబ్రమణియన్ ఈ పదవిలో కొనసాగనున్నారు.

శ్రీ రామన్ 1991 బ్యాచ్ ఇండియన్ ఆడిట్-అకౌంట్స్ సర్వీస్ (ఐఏ-ఏఎస్) అధికారి. పీఎఫ్ఆర్‌డీఏలో చేరడానికి ముందు, ఆయన భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయంలో డిప్యూటీ కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌గా, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన గతంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా.. నేషనల్ ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ఈఎస్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా.. జార్ఖండ్ రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌గా.. అనేక కీలక పదవుల్లో పనిచేశారు. సెక్యూరిటీస్ ? ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)లో 2006 నుంచి 2013 వరకు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎమ్)గా, తరువాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా ఆయన పనిచేశారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి శ్రీ రామన్ ఆర్థిక శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ, ఎమ్‌బీఏ పట్టా పొందారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ - పొలిటికల్ సైన్స్ నుంచి ఫైనాన్షియల్ రెగ్యులేషన్‌లో ఎమ్మెస్సీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎల్ఎల్‌బీ, పొలిటికల్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ సర్టిఫికేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నల్ ఆడిటర్స్ (ఐఐఏ), ఫ్లోరిడా నుంచి సర్టిఫైడ్ ఇంటర్నల్ ఆడిటర్ క్రెడెన్షియల్, సెక్యూరిటీస్ లా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా వంటి వివిధ ప్రొఫెషనల్, అకడమిక్ అర్హతలను కూడా ఆయన కలిగి ఉన్నారు.

ప్రభుత్వ ఆర్థిక, సాంకేతికత రంగాలు, ఆర్థిక నియంత్రణలో తనకున్న అపార అనుభవంతో.. భారత పెన్షన్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, పౌరులందరికీ పదవీ విరమణ భద్రతను ప్రోత్సహించే లక్ష్యంతో శ్రీ రామన్ పీఎఫ్ఆర్‌డీఏకి మార్గనిర్దేశం చేయనున్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం.. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ




నిజామాబాద్, జూన్ 21: ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి యోగా ఎంతో ముఖ్యమని, దినచర్యలో ఒక యోగ భాగమైనప్పుడే సంపూర్ణ ఆరోగ్యమని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల మెడికవర్ హాస్పిటల్స్ ఓపి విభాగం వద్ద శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ హాజరై మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ వారు దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యతపై తెలియపరిచేందుకు ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మనిషి ఆరోగ్య పరిరక్షణకు అవగాహన కలిగించే దిశగా కృషి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా ఉండవచ్చని ఆయన సూచించారు.

అనంతరం మెడికల్ హాస్పిటల్స్ వైద్యులు డా.వారిస్ అలీ మాట్లాడుతూ యోగా అనేది మన భారతీయ సంస్కృతిలో పురాతనమైందని వారు పేర్కొన్నారు. యోగా చేయడం ద్వారా శరీరం మనసును ఆలోచన విధానాన్ని నియంత్రిస్తుందని తెలిపారు. నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యం శ్రేయస్సు ఎంతో లబ్ది చేకూరుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్స్ డాక్టర్ సందీప్ రావు, ఇంటర్వెషనల్ కార్డిలోజిస్ట్, డాక్టర్ ప్రశాంత్ పుల్మలోజిస్ట్, డాక్టర్ యజ్ఞ, డి ఎం.ఎస్ సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కుల వృత్తులను కాపాడాలి

**- నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్**

**- కార్పొరేట్ సెలూన్ లకు వ్యతిరేకంగా మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్ హాల్ నుండి బల్లేపల్లి వరకు నాయి బ్రాహ్మణుల భారీ ర్యాలీ**




ఖమ్మం, జూన్ 21 (నేటినిజం ప్రతినిధి): తరతరాలుగా కులవృత్తినే నమ్ముకుని అనేక జాతులు తమ జీవనవిధానాన్ని కొనసాగిస్తున్నాయని కులవృత్తులను కాపాడాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్ హాల్ నుండి బల్లేపల్లి వరకు నాయి బ్రాహ్మణులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మాట్లాడుతూ...కులవృత్తులను కాపాడడానికి ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా చదువు ఉద్యోగాలను వదిలేసి ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కులవృత్తినే నమ్ముకొని జీవన విధానాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. కానీ కొన్ని కార్పొరేట్ శక్తులు కులవృత్తులను కొల్లగొట్టేందుకు కార్పొరేట్ సెలూన్లను ఏర్పాటుచేసి యదేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సెలూన్ లు లాభాల వరకే పని చేస్తాయని ఇది సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రజలతో మమేకమై ప్రతి కార్యక్రమంలో కులవృత్తులను కాపాడుకుంటూ ప్రజా సేవలో భాగంగా పనిచేసే కులాల వారికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్పొరేట్ శక్తులకు అవకాశం ఇస్తే మంచి చెడులకు అవకాశమే ఉండదన్నారు. కార్పొరేట్ సెలూన్లను తొలగించే వరకు పోరాడుతామని, దీనిని జిల్లా వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి కులవృత్తులను కాపాడుకుంటామని అన్నారు. కులవృత్తుల పై ఆధారపడిన వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని ముగ్గురు మంత్రులకు విన్నవించామని వారు సానుకూలంగా స్పందించారని జగదీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నాయకులు, నగర సభ్యులు, తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

## ఇరాన్ పై దాడులు .. మోదీ మౌనం వీడాలన్న సోనియా గాంధీ..

న్యూఢిల్లీ, జూన్ 21: ఇజ్రాయెల్-ఇరాన్ల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై భారత్ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తప్పుబట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ మౌనం దౌత్య వైఫల్యంలా కన్పిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి భారత దేశ నైతిక, వ్యూహాత్మక సంప్రదాయం నుంచి దూరంగా జరిగినట్లుగా కనిపిస్తోందని అన్నారు. ఈ మేరకు సోనియా ఒక ప్రకటనను నేడు విడుదల చేశారు.. టెహ్రాన్ పై, టెల్ అవీవ్ చేస్తున్న దాడులు చట్టవిరుద్ధమైనవిగా.. సార్వభౌమాధికార ఉల్లంఘనగా అభివర్ణించారు.

ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల వల్ల ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయని సోనియా పేర్కొన్నారు. ఈ ఘర్షణలు అస్థిరతను మరింత తీవ్రతరం చేయడం వల్ల మరిన్ని సంఘర్షణలకు బీజాలు వేస్తాయన్నారు.

ఇరాన్, అమెరికాల మధ్య అణు చర్చలకు మార్గం సుగమం అవుతున్న సమయంలో టెల్ అవీవ్ ఒక్కసారిగా టెహ్రాన్ లోని అణుస్థావరాలపై దాడులకు దిగడం సరైన చర్య కాదని సోనియా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎంతో కాలంగా మిత్రదేశంగా ఉన్న ఇరాన్ దూరం చూసుకోవద్దని మోదీ ప్రభుత్వానికి హితవు పలికారు..

మరోవైపు ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమంలో గాజాలో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రస్తుతం గాజా కరవు అంచున ఉండడంతో అక్కడ మిగిలిఉన్న ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు.


**కొప్పర్తి పుస్తకాల ఆవిష్కరణ**

జూన్ 29, 2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు

సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

అధ్యక్షత

శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు

ప్రముఖ కవి, విమర్శకులు, చిత్రకారులు



చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి

సంభాషణ

ఆవిష్కరణ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

ప్రముఖ చరిత్రకారులు

విశ్లేషణ శ్రీ దాసనపూడి సోమసుందర్

జాతీయ కార్యదర్శి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్



మూడు కవిత్వ సంపుటాల సంకలనం

కొప్పర్తి కవిత్వం

ఆవిష్కరణ డా. పాపినేని శివశంకర్

కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారగ్రహీత

విశ్లేషణ శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య

ప్రముఖ కవి, విమర్శకులు

యువకవుల స్పందన కట్టా సిద్ధార్థ

కడలి

అందరికీ ఆహ్వానం

సాహితీమిత్రులు, హైదరాబాద్

# ఎన్‌బీటీ నగర్‌లో త్వరలో జూనియర్ కళాశాల ఏర్పాటు : జీహెచ్ఎంసీ మేయర్



హైదరాబాద్, జూన్ 21:బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీ నగర్‌లో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయనున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.1.16 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాన్ని మేయర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం కేవలం 200 మంది విద్యార్థులతో ఉన్న ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలను అంచలంచెలుగా అభివృద్ధి చేసుకుంటూ ప్రస్తుతం 1100 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా తీర్చిదిద్దామన్నారు.

కొత్తగా నిర్మించిన భవనంలో అదనపు తరగతి గదులతో పాటు లైబ్రరీ, సైన్స్‌లాబ్, డైనింగ్‌హాల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ కోసం వేరేప్రాంతాలకు వెళ్లకుండా ఎన్‌బీటీ నగర్‌లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. దీని కోసం స్థలం సిద్దంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, డిప్యూటీ ఈవో శామ్యూల్‌రాజుతో పాటు అద్యాపకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, మహిళా సమాఖ్యల సభ్యులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి



సంగారెడ్డి జూన్ 21(నేటి నిజం ప్రతినిధి )సదాశివపేట బాలికల ప్రాథమిక పాఠశాలలో ఆర్వో ప్లాంట్, ఆధునిక తరగతులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య .

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల సహకారంతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్, ఆధునికీకరించిన తరగతి గదులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భముగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య మాట్లాడుతూ... బడి బయట పిల్లలు అందరిని ప్రభుత్వ పాఠశాలల్లో నే చేర్పించాలని విద్యాధికారులను ఆదేశించారు . సిఎస్ఆర్ నిధులు సామాజిక ప్రయోజనాల కోసం వినియోగించడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి కి పారిశ్రామిక వేత్తలు కృషి చేయాలని సూచించారు . ఈ సందర్భముగా వాటర్ ఎయిర్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్, తవక్కం అనే స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైనట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య వెల్లడించారు . వారి కృషి హర్షనీయమని ఆమె పేర్కొన్నారు . సిఎస్ఆర్ నిధులను సమర్ధవంతంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపడతాయని అన్నారు .

ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ,యూనిఫారమ్స్ , డిజిటల్ విద్యాబోధన, పాఠశాలకు కావలసిన వసతుల గురించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో మండలవిద్యాధికారి శంకర్ , తహసీల్దార్ , వాటర్ ఎయిర్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్, తవక్కం సంస్థల ప్రతినిధులు కృష్ణకుమార్ సురేష్ , దినేష్ బాబు , కె .దుర్గా ప్రసాద్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారతదేశంలోని పేద చిన్న వ్యాపారవేత్తలకు వాహన ఫైనాన్సింగ్ సులభతరం చేయడానికి మహావీర్ ఫైనాన్స్ రూ. 200 కోట్ల నిధులను సేకరించింది.




హైదరాబాద్, జూన్ 21:వాడిన వాణిజ్య మరియు ప్రయాణిక వాహనాల రుణాల్లో నైపుణ్యం కలిగిన చెన్నై కేంద్రంగా ఉన్న ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన మహావీర్ ఫైనాన్స్ ఇండియా లిమిటెడ్, 200 కోట్ల నిధులను సమీకరించినట్లు ఈ రోజు ప్రకటించింది. ఈ రౌండ్‌కి Elevation Capital నాయకత్వం వహించగా, ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులు అయిన BanyanTree Finance మరియు First Bridge Capital కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ పెట్టుబడి మహావీర్ ఫైనాన్స్ బలమైన వ్యాపార నమూనా, నైపుణ్యాలపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూపుతుంది దీని వెనుక అనుభవంతో కూడిన ప్రాప్తి, సాంకేతికత వినియోగం సంస్థకు నిబద్ధతతో పని చేస్తున్న ఉద్యోగుల బలమైన మద్దతు ఉన్నది. ఈ పెట్టుబడి సహాయంతో సంస్థ దక్షిణ భారతదేశం లోని తన బలమైన మార్కెట్లలో ఆధిపత్యాన్ని బలపరచడం, సాంకేతిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రస్తుతానికి బహుళంగా అనధికారిక రుణదాతలపై ఆధారపడు తున్న వినియోగదారులకు ప్రత్యామ్నాయాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. 1981లో స్థాపించబడిన మహావీర్ ఫైనాన్స్, వాడిన వాహనాల రుణ మార్కెట్‌లో కీలకమైన పాత్ర పోషిస్తోంది. 2016 నుండి, సంస్థ రెండో తరం నేతృత్వంలో,50 కోట్ల నుండి ప్రస్తుతం 1000 కోట్లకు AUM ను పెంచుకుంది. ఇది తమ స్వంత క్రెడిట్ ఇంజిన్ "" లోన్ ప్రాసెసింగ్ సిస్టమ్ద్వారా సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి, తక్కువ క్రెడిట్ ఖర్చుతో అధిక ఉద్యోగి ఉత్పాదకతను సాధించింది. డిజిటల్ చెల్లింపు పద్ధతులను ముందుగానే స్వీకరించడం వల్ల నగదు చెల్లింపులు రెండంకెలకు తగ్గాయి. అలాగే, ప్రజల నేతృత్వం లోని విధానం పరిశ్రమలో అతి తక్కువ వలసలకు దారితీసింది. ప్రస్తుతం సంస్థ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల్లో 80కి పైగా బ్రాంచ్‌లు నిర్వహిస్తూ, 20,000+ యాక్టివ్ కస్టమర్లకు సేవలు అందిస్తోంది. దీన్ని సీఈఓ మరియు మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ దూగర్ సీఎఫ్ఓ డిప్యూటీ ఎండీ ప్రవీణ్ దూగర్ నేతృత్వం వహిస్తున్నారు.

# మేడియాటెక్ డైమెన్సిటీ 8450 మొబైల్ ప్లాట్‌ఫారమ్ ఆవిష్కరణ




హైదరాబాద్, జూన్ 21:ప్రపంచంలోనే అగ్రగామి ఫాబ్‌లెస్ సెమీకండక్టర్ కంపెనీ అయిన మేడియాటెక్, ప్రతి ఏడాదీ సుమారు 2 బిలియన్ల కనెక్ట్ చేయబడిన పరికరాలకు శక్తినందిస్తున్న కంపెనీ, మేడియాటెక్ డైమెన్సిటీ 8450 ను మేడియాటెక్ ఇండియా డైమెన్సిటీ సమ్మిట్‌లో ఆవిష్కరించింది. ఈ ప్రీమియం 5 జి స్మార్ట్‌ఫోన్ చిప్ అసాధారణమైన పనితీరు, సామర్థ్యం, మరియు కనెక్టివిటీని అందించడానికి రూపొందించబడింది. ఈ సమ్మిట్ మేడియాటెక్ కనెక్ట్ సమాజానికి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా జరువుకుంది, ఇది టెక్ అభిరుచికరులు మరియు అభిమానులతో కూడిన సమూహం, మేడియాటెక్ డైమెన్సిటీ పరికరాలను ఉపయోగించి గేమింగ్ టోర్నమెంట్ నిర్వహించబడింది. ఈ ఈవెంట్‌లో ఫ్లాగ్‌షిప్, ప్రీమియం, మరియు ఎంట్రీ-లెవల్ స్మార్ట్‌ఫోన్ల కోసం డైమెన్సిటీ 5ఉ చిప్‌సెట్ పోర్ట్‌ఫోలియోను కూడా ప్రదర్శించారు. "మేడియాటెక్ డైమెన్సిటీ 8450 ఆవిష్కరణతో, వేము అగ్రగామి మొబైల్ ప్లాట్‌ఫారమ్‌ల పోర్ట్‌ఫోలియోను విస్తరించాము, పరికర తయారీదారులు వినియోగదారులు ప్రీమియం అనుభవాలను మరింత విస్తృతంగా ఎంచుకునే అవకాశం కల్పించాము. ఈ చిప్ వినియోగదారులను ఎ ఎ ఇమేజింగ్ సామర్థ్యాలతో క్రియేటివిటీని వెలిబుచ్చేందుకు శక్తినిచ్చి, మొబైల్ గేమింగ్‌ను మరో స్థాయికి తీసుకువెళ్తుంది," అని మేడియాటెక్ వైర్లెస్ కమ్యూనికేషన్స్ బిజినెస్ యూనిట్ జనరల్ మేనేజర్ డాక్టర్ యెన్చి లీ తెలిపారు. "మా ఆల్ బిగ్ కోర్ డిజైన్ తో, ఇది మా ఫ్లాగ్‌షిప్ చిప్‌లలో కూడా ఫీచర్ చేయబడింది, అసాధారణమైన పనితీరు మరియు సామర్థ్యాన్ని సమర్థంగా అందిస్తున్నాం."

# యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలి..

## ఆయూష్ డాక్టర్ రాధిక

నిజామాబాద్, జూన్ 21: ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలని, యోగా శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే అద్భుతమైన సాధనమని ఆయుష్ డాక్టర్ రాధిక అన్నారు. మండల కేంద్రంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక, జిల్లా పరిషత్ ఉర్దూ, తెలుగు పాఠశాల, బాలాజీ మందిర్ ఆలయ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

యోగా సాధకులు సతీష్ గౌడ్, జ్యోతి విద్యార్థులు, స్థానికులతో యోగాసనాలు చేయించారు. విద్యార్థులు నిర్వహించిన యోగా విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ ప్రతీరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారనీ, ప్రతీ ఒక్కరూ వారీ జీవన శైలిని మార్చుకొని, ప్రతీ రోజు కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. దీంతో శారీరక, మానసిక ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి సెంట్రల్ జైలు కంది నందు జిల్లా జడ్జీ తనిఖీ ..



సంగారెడ్డి జూన్ 21 (నేటి నిజం ప్రతినిధి) జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవానిచంద్ర గారి ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు కంది నందు తనిఖీ నిర్వహించడం జరిగింది.

ఈ తనిఖీ నందు జిల్లా జడ్జీ శ్రమతీ జి.భవాని చంద్ర గారు ముఖ్య అతిథి గా పాల్గొని సెంట్రల్ జైలు నందు ఉన్న బెరక్స్లు, గదులు, వంట గది, మరియు బాత్రూంలు జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించి ఖైదీలను జైలులో ఉన్న సదుపా యాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు అన్ని ఖైదీలు బెరక్స్లు క్షున్నంగా పరిశీలించి వారికీ కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ గారికి తెలియజే సారు. మరియు వారికీ ఖైదీలతో వారికీ సమయానికి బైల్స్, ములాఖత్ అందుతున్నాయ, కేసులు పరిష్కరిం చేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలియపరిచారు.

మరియు జిల్లా జడ్జీ గారు ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూడడం జరిగినది ఖైదీల కోసం వన్డే కూరగాయలు, బియ్యం, ఉన్న రూమ్ ని కూడా తనిఖీ చేయడం జరిగింది. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ కూడా పరిశీలించడం జరిగింది.

ఈ తనిఖీ నందు జిల్లా జడ్జీ శ్రీమతి జి.భవాని చంద్ర గారు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు మరియు జైలు సూపరింటెండెంట్ కాలా సాగర్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# యోగా ప్రభావాన్ని తేటతెల్లం చేసిన ప్రపంచవ్యాప్త శాస్త్రీయ అధ్యయనాలు, పరిశోధనలు: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, జూన్ 21:లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా నేతృత్వంలో ఈరోజు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పార్లమెంటు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీలూ, మాజీ సభ్యులు, లోకసభ, రాజ్యసభ సచివాలయాల ఉద్యోగులు ఇతరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీ బిర్లా మాట్లాడుతూ శరీరం, మనస్సు, ఆత్మల మధ్య అనుసంధానాన్ని సాధించడానికి యోగా ఓ శక్తిమంతమైన సాధనంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. మనిషి సమగ్రాభివృద్ధిలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యోగా కేవలం ఓ వ్యాయామం మాత్రమే కాదని, ఇది వ్యక్తులకు బలాన్ని, ప్రశాంతతను, ఆధ్యాత్మిక శక్తితో సాధికారతను అందించే సమగ్ర జీవన విధానమని ఆయన వ్యాఖ్యానించారు.

యోగాను ప్రజలు జీవితాల్లో భాగం చేసుకుని, అది తమలో కలిగించిన సానుకూల మార్పులను అందరితో పంచుకోవాలని శ్రీ బిర్లా కోరారు. యోగా సానుకూల శక్తిని తెలుసుకునేలా ఇది ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా యువత సామర్థ్యం, ఆత్మవిశ్వాసం, లక్ష్యం పట్ల స్పష్టతను పెంపొందించుకునే మార్గంగా యోగాను స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

యోగా దినోత్సవాన్ని భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని శ్రీ బిర్లా పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో లక్షలాదిగా ప్రజలు యోగా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ, ఈ పురాతన సంప్రదాయ స్ఫూర్తిని అందిపుచ్చుకుంటున్నారని ఆయన అన్నారు.

భారత పురాతన, ప్రశస్తమైన ఆచరణల్లో ఒకటైన యోగాకు నేటి ఆధునిక, శాస్త్రీయ యుగంలోనూ అమితమైన ప్రాధాన్యం ఉందన్నారు. మన శారీరక, మానసిక ఆరోగ్యంపై యోగా సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్న విషయం ప్రపంచవ్యాప్తంగా అనేక శాస్త్రీయ అధ్యయనాలు, పరిశోధనల్లో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఒత్తిడిని అధిగమించడానికి, అంతర్గత శక్తిని పెంపొందించుకోవడానికి, శక్తిని నిర్మాణాత్మకంగా, శాంతియుతంగా వినియోగించుకోవడానికి యోగా దోహదపడుతుందన్నారు. ఏకాగ్రతను, పని సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ఆరోగ్యకరమైన, సమతౌల్యంతో కూడిన జీవనశైలిని యోగా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

మెరుగైన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం అనేక దేశాల్లో ప్రజలు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవడం హర్షణీయమన్నారు. ఆరోగ్యకరమైన, మరింత శాంతియుతమైన ప్రపంచం దిశగా అన్ని సంస్కృతుల ప్రజలను యోగా ఇకముందు కూడా ఏకం చేస్తూ ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్రహ్మకుమారీలు భారతీయుల జీవనాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశాన్ని అందించారు: లోక్‌సభ స్పీకర్

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా నేతృత్వంలో ఎర్రకోట ప్రాంగణంలో బ్రహ్మకుమారీలు ఈరోజు సామూహిక యోగాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజయోగా, జ్ఞానయోగా ద్వారా శాంతిని, ఆరోగ్యాన్ని పెంపొందించడానికి బ్రహ్మ కుమారీ సంస్థ చేస్తున్న అమూల్యమైన కృషిని అభినందించారు. ఈ సంస్థ భారతీయుల జీవితాలను ప్రభావితం చేయడవే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశాన్ని వ్యాప్తి చేసిందని ప్రశంసించారు. ప్రజలు ఒత్తిడి, ఆందోళనలను అధిగమించడంతోపాటు అంతర్గత శాంతిని పొందడంలో ఇది సహాయపడుతుందన్నారు.

ఇటీవలి తన బ్రెజిల్ పర్యటనను గుర్తుచేసుకుంటూ, బ్రహ్మ కుమారీల కృషి అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేసిందని, ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో సానుకూల ప్రభావాన్ని వారు కలిగించారని శ్రీ బిర్లా పేర్కొన్నారు. భారతీయ విలువలు మూలాలుగా ఉన్న ఓ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ప్రేరణగా నిలుస్తూ, అర్థవంతమైన పరివర్తన దిశగా నడిపిస్తుండటం గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు.

# అల్ఫోర్స్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




కరీంనగర్, జూన్ 21:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేడుకగా నిర్వహించినటువంటి యోగా దినోత్సవ్ వేడుకలకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. యోగా అనేది పురాతన శాస్త్రమని మరియు ఈ శాస్త్రం ద్వారా సమాజంలో ప్రతిఒక్కరికి లాభాలు చేకూరుతాయని కాని దీనిని ప్రతి ఒక్కరు సరియైన పద్ధతిలో యోగా శాస్త్రంలో తెలుపబడినటువంటి నియమావళిని పాటించినట్లైతే ఎటువంటి వైద్య సలహాలు అవసరముండదని అభిప్రాయడుతూ మన భారతదేశంలో ఆవిర్భవించినటువంటి ఈ యోగా శాస్త్రానికి చాలా ప్రాముఖ్యత ఉన్నదని, దీనిని మన దేశంలోనే కాకుండ ఇతర దేశాలలో సైతం ఒక గొప్ప ప్రక్రియగా పరిగనిస్తున్నారని తెలిపారు. యోగా అనేది రోజువారి కార్యక్రమంలా రూపొందిచుకోవాలని మరియు క్రమం తప్పకుండా సాదన చేసేవారికి ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. 5000 సం॥ల క్రితం నాటి యోగా శాస్త్రం ఋగ్వేదలో స్పష్టంగా రూపొందించబడినదని మరియు వాటిలోని సూత్రాలను పాటించినట్లైతే ఎటువంటి కార్యక్రమానైన చాలా సులభంగా చేయగలుగుతామని చెప్పారు. భారతదేశంలో అమలు చేస్తున్న ఈ యోగా సాదన ప్రపంచంలోని అన్ని దేశాల వారు అమలు చేస్తున్నారని మరియు ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారని పలు నివేదికల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నదని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఈ వేడుకలను చాలా గొప్పగా ఆదర్శనీయంగా నిర్వహించడం ఒక ఆనవాయితి అని ఆ ఆనవాయితిని ఈ సం సైతం రెట్టింపు ఉత్సాహంతో నిర్వహించడం చాలా హర్షదాయకమని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు ఆసనాలు, ప్రాణయామం ఆసనాలు చాలా ఆకర్షనీయంగా నిలిచాయి. ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించినటువంటి పలు నృత్యాలు నాటికలు నూతన ఉత్సాహాన్ని నింపాయి. చివరగా ప్రతి ఒక్కరు యోగను మర్చిపోవద్దని యోగా మూలాలను ఎప్పటికప్పుడు సాధన చేస్తు అందరికంటే అగ్రగామిగా ఉండి సమాజ హితానికి తోడ్పాటును అందించాలని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి నుంచి రాష్ట్రంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ !

హైదరాబాద్, జూన్ 21:రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో సింగరేణి కాలరీస్ కంపెనీ మరో వినూత్న విద్యుత్ ఉత్పాదన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రామగుండం1 ఏరియాలోని మూతపడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో ఏర్పడిన నీటి సంపును ఆధారంగా 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి తొలి అడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తిస్థాయి ప్రాజెక్ట్ నివేదిక (ఆఖఖీ) తయారీకి ప్రభుత్వ రంగ సంస్థ అయిన వైఆప్కోస్ లిమిటెడ్‌కు బాధ్యత అప్పగించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని సీఎండీ ఎన్. బలరామ్ వెల్లడించారు. రాష్ట్రంలో ఇటువంటి ప్రాజెక్టును మొదటిసారిగా చేపట్టడం గర్వకారణమని, ఇది ప్రయోగాత్మకంగా విజయవంతమయ్యే అవకాశముందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది సాధారణ జలవిద్యుత్ ప్రాజెక్టుల తరహాలో పనిచేస్తుంది. పగటిపూట సోలార్ విద్యుత్తుతో నీటిని పైభాగంలో నిర్మించే రిజర్వాయర్‌లోకి పంపించి, రాత్రివేళ దానిని కిందికి పంపిస్తూ మధ్యలో టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. మేడిపల్లిలో ఇప్పటికే 157 మీటర్ల లోతు కలిగిన నీటి సంపు ఉండటంతో, అదే ప్రదేశాన్ని ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. ఉపరితలంపై 2,350 మీటర్ల పొడవుతో, 23 మీటర్ల లోతులో భారీ రిజర్వాయర్ నిర్మించనున్నారు.

ప్రాజెక్ట్ ఖర్చు దాదాపు ?3,000 కోట్లుగా అంచనా వేయబడుతోంది. అయినప్పటికీ, ఇది సింగరేణికి 40 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయ వనరిగా నిలవనుందని సంస్థ భావిస్తోంది. డిపిఆర్ పూర్తైన వెంటనే నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలవనున్నారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థకు చెందిన ఉన్నతాధికారులు ? డైరెక్టర్ ఈ అండ్ ఎం డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పరిశుభ్రమైన, పునరుత్పాదక విద్యుత్తు విభాగంలో ఒక పెద్ద అడుగుగా ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చూస్తోంది.

# పెద్దమ్మ తల్లి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల, జూన్ 21:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మహాలక్ష్మీ వీధిలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు..అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు..

# భారత్‌లో కణ, జన్యు చికిత్స అభివృద్ధి దిశగా.. మిల్టెనీ బయోటెక్ ఇండియా, బైరాక్ భాగస్వామ్యం



హైదరాబాద్, జూన్ 21: భారత్‌ను బయోథెరపీ రంగంలో ముందుకు నడిపించే దిశగా ఒక కీలక అడుగు పడింది. మిల్టెని బయోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బైరాక్) బోస్టన్‌లో జరుగుతున్న బయో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ 2025లో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా దేశీయ శాస్త్రీయ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, సీఏఆర్-టీ క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడం, సెల్ థెరపీ ఉత్పత్తి ద్వారా వైద్య అవసరాలు తీర్చడం, ప్రజలకు చేరువలోనే చికిత్స అందించేలా పోయింట్-ఆఫ్-కేర్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా భారతీయ స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేస్తూ.. టార్గెటెడ్ సెల్ థెరపీ పరిశోధనకు ప్రోత్సాహం కల్పించనున్నారు. ఇది 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు అనుగుణంగా దేశీయంగా కీలక తయారీ భాగాల ఉత్పత్తిని పెంచడమే కాక, నేషనల్ సీజీటీ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకు బలం చేకూరుస్తుంది. ఈ సందర్భంగా మిల్టెని బయోటెక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ప్రియా కపూర్ హింగోరానీ మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఇవి ఎంతగానో ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా శాస్త్రవేత్తల నైపుణ్యాలు మెరుగుపరుస్తూ.. శాస్త్రీయ మౌలిక సదుపాయాలు బలోపేతం చేయడం పై దృష్టి సారించను న్నామన్నారు. పాయింట్ ఆఫ్ కేర్ సీఏఆర్-టీ, గ్రాఫ్ట్ ఇంజినీరింగ్ విధానాల ద్వారా ఆటోఇమ్యూన్ వ్యాధులు, అరుదైన వ్యాధులను ఎలా పరిష్కరించవచ్చన్న దానిపై పరిశోధనలు చేస్తున్నామన్నారు.


ఆహ్వానం






కిన్నెర ఆర్ట్ థియేటర్స్

ప్రముఖ రచయిత

శ్రీ చిటిప్రోలు సుబ్బారావుగారు

రచించిన

వెన్నెలగింజలు కవితా సంపుటి

ఆవిష్కరణ

శనివారం 28-6-2025, సా॥ 6 గంటలకు

Centre for Economic and Social Studies
Lane Beside Dr Agarwal Eye Hospital
Punjagutta Officers Colony,
Near Punjagutta Metro Station, Hyderabad

ముఖ్యఅతిథి : జస్టిస్ శ్రీ ఎన్.వి. శ్రవణ్ కుమార్
న్యాయమూర్తి, తెలంగాణ హైకోర్టు

అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

విశిష్ట అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త

గౌరవ అతిథి : శ్రీ దుర్గంపూడి చంద్రశేఖర్ రెడ్డి, సంపాదకులు, ఎమెస్కో

ఆత్మీయ అతిథి : డా॥ బీరం సుందరరావు, ప్రముఖ రచయిత

సాంస్కృతిక కార్యక్రమం : సా॥ 6 నుండి 6-45 వరకు
నృత్య కిన్నెర సమర్పించు అమృతోత్సవ భారతి కూచిపూడి నృత్య రూపకం
నృత్య దర్శకత్వం: హంస పురస్కార గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత
డా॥ మద్దాళి ఉషాగాయత్రి
సంగీత దర్శకత్వం: శ్రీమతి శ్రీవల్లీ శర్మ

సభానంతరం విందు భోజనం

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు | సర్వా శ్రీనివాస్ నిర్వాహకులు | మద్దాళి రఘురామ్ కార్యదర్శి


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.